విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 220 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|


# RESPECTED MEMBERS PLEASE ELECT




# TELANGANA HIGH COURT ADVOCATE ASSOCIATION

HYDERABAD . CEll:7989289492

వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 220 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/-

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా

# దూసుకెళ్లాలా

- బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణలపై ప్రజలకు వివరించాలి
- విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాల్సిందే
- స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలపై దృష్టి సారించండి
- సీఎల్పీ భేటీలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పుకోండి



హైదరాబాద్,

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో కొత్త పాత నేతలు సమన్వయంతో సాగితేనే స్థానిక సంస్థల్లో పాగా వేయగలమని సూచించారు.

-మిగతా 3 లో






## వలసదారులను తిప్పి పంపడం కొత్తేమీ కాదు

- ఏళ్లుగా అక్రమ వసలదారులను పంపిచేస్తున్న అమెరికా
- ఇది మన దేశానికే కాదు..అన్ని దేశాలకు వర్తిస్తుంది
- రాజ్యసభలో విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటన
- వలసదారులకు బేడీలు వేశారని విపక్ష ఎంపిల ఆందోళన

న్యూఢిల్లీ,

అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలింపు పక్రియ కొత్తదేమీ కాదని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు పక్రియ జరుగుతూనే ఉంది. ఇది ఏ ఒక్క దేశానికి సంబంధించిన విధానం కాదు. అన్నిదేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోంది. 2012లో ఈ సంఖ్య 530గా ఉండగా.. 2019లో

-మిగతా 3 లో



## విసిల నియామకంలో యూజిసి పెత్తనం సరికాదు

- విద్యార్థుల ప్రయోజనాలకు ఇది విఘాతం
- కేంద్రమంత్రికి కెటిఆర్ వినతి పత్రం అందచేత
- ఎన్‌హెచ్ 365 పొడిగించాలని గడ్కరీకి కెటిఆర్ వినతి

న్యూఢిల్లీ,

యూజీసీ నూతన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు నివేదించినట్లు మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీల బాధ్యతను

-మిగతా 2 లో

## తెలంగాణకు గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం

### రూ. 176.5 కోట్ల విడుదలకు ఆమోదం

హైదరాబాద్,

జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ "రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి పథకం "కింద తెలంగాణకు రూ.176.5 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద నిర్దేశించిన మైలురాయిని సాధించినందుకు రాష్ట్రాలు ప్రోత్సాహక మొత్తాన్ని పొందేందుకు అర్హులు. తెలంగాణ రాష్ట్రానికి జాతీయ రోడ్డు రవాణా శాఖ అదనపు ప్రోత్సాహక సహాయం అందించింది. తెలంగాణ ఈ పథకం ద్వారా మైల్ స్టోన్ 1లో రూ.51.5 కోట్లు , మైల్ స్టోన్ 2లో రూ.125 కోట్లకు

-మిగతా 3 లో






## యూజిసి నిబంధనలు దేశ సంస్కృతిపై దాడి

-ఆర్ఎస్ఎస్ భావజాల జొప్పించే ప్రయత్నం

-డిఎంకె ఆందోళనలో రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,

యూజీసీ ముసాయిదా విద్యాపరమైన చర్య మాత్రమే కాదని, ఇది మన చరిత్ర, సంప్రదాయం, సంస్కృతి, భాషలపై దాడి చేసేందుకు ఆరెస్సెస్ చేస్తున్న ప్రయత్నం అని కాంగ్రెస్ ఎంపి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇదే విషయాన్ని తాను కొంతకాలంగా చెబుతున్నానని అన్నారు. ఈ దేశంలో

-మిగతా 3 లో

## కులగణన పై విపక్షాల విమర్శలు తిప్పికొట్టాలి

- పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నాం
- పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం
- ఈ నెలలోనే రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్,

కులగణనపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలని కాంగ్రెస్ నిర్ణయించిందని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యేలకు సూచించామని అన్నారు. పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం. రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాం. ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం. బహిరంగ సభలకు అధిష్ఠానం నేతలను ఆహ్వానించేందుకే దిల్లీ వెళ్తున్నాం.

-మిగతా 3 లో





## 12 నుంచి మినీ మేడారం జాతర

- 4 రోజులపాటు జాతర సంబురాలు
- పటిష్ట ఏర్పాటు చేసిన అధికారులు

హైదరాబాద్,

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు సమయం ఆసన్నమైంది. మహాజాతర ముగిసిన ఏడాదికి అదే మాదిరిగా మినీ మేడారం జాతర జరుగుతున్న

-మిగతా 3 లో



## అంబేద్కర్ ను ఏనాడు గౌరవించని కాంగ్రెస్

### ఓట్ల కోసం జై భీమ్ నినాదాలు చేస్తోంది

-అంబేద్కర్‌ను ఓడించేందుకు అనేక కుట్రలుచేసింది

-రాజ్యసభలో మరోమారు కాంగ్రెస్‌ను దునుమాడిని మోడీ

న్యూఢిల్లీ,

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల కాంగ్రెస్‌కు ఏనాడూ గౌరవం లేదని ప్రధాని మోడీ అన్నారు. ఓట్ల రాజకీయంకోసం ఇప్పుడు ఆయన పేరును వాడుకుంటోందని మండిపడ్డారు.

-మిగతా 3 లో

# కేంద్ర కేబిన్ ముందుకు కొత్త ఆదాయచట్టం

## నేటి కేబినేట్ ఆమోదం అనంతరం పార్లమెంట్‌కు




**న్యూఢిల్లీ,**
ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో త్వరలో కొత్త చట్టం రాబోతోంది. దీనికి సంబంధించిన బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. పాత చట్టంతో పోలిస్తే ఇందులోని నిబంధనలు అందరికీ అర్థమయ్యేలా ఉండబోతున్నాయని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లుపై శుక్రవారం కేబినెట్‌లో చర్చించి ఆమోద ముద్ర వేయనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం, 1961 స్థానంలో కొత్త బిల్లు తీసుకు రానున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల బ్జడెట్‌లో వెల్లడించిన సంగతి తెలిసిందే. కొత్త బిల్లులో ఆదాయపు పన్ను రేట్లు, శ్లాబులు, బ్జడెట్‌లో ప్రతిపాదించిన టీడీఎస్ నిబంధనలు సైతం పొందుపరచనున్నారు. ఈ బిల్లులో సుదీర్ఘ వాక్యాలు ఎక్కడా ఉండబోవని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్‌కాంత పాండే తెలిపారు. కొత్తగా ఎలాంటి పన్నులు గానీ, అదనపు భారాలు గానీ ఉండబోవన్నారు. కేవలం న్యాయ కోవిదులకే కాకుండా సామాన్యులు సైతం సులువుగా అర్థం చేసుకునే విధంగా ఉండాలన్న సంకల్పంతో ఈ బిల్లును రూపొందిచినట్లు తెలిపారు.

# నకిలీ ఐడి కార్డుతో సచివాలయ ప్రవేశానికి యత్నం

## అడ్డుకుని అరెస్ట్ చేసిన భద్రతా సిబ్బంది



**హైదరాబాద్,**
తెలంగాణ సచివాలయంలోకి నకిలీ తహసీల్దార్ వెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. తిప్పర్తి తహసీల్దార్ అని చెప్పి అంజయ్య అనే వ్యక్తి నకిలీ ఐడీ కార్డుతో సచివాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి అడ్డుకున్నారు. తిప్పర్తి ఎంఆర్‌వో కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతో అంజయ్య నకిలీ తహసీల్దార్ అని తేలింది. ఎస్‌టీఎఫ్ ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అంజయ్య వచ్చిన వాహనంపై కూడా తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అని స్టిక్కర్ ఉండటంతో పోలీసులు కంగుతిన్నారు.

# అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిన జగన్

## ఇరిగేషన్ డైరీ అవిష్కరణలో మంత్రి నిమ్మల



**విజయవాడ,**
ఏపీ ఇరిగేషన్ ఎన్జీవోస్ అసోసియేషన్ డైరీను మంత్రులు నిమ్మల రామానాయుడు, సత్య కుమార్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత అయిదేళ్ళ పాలనలో ఇరిగేషన్ శాఖతో పాటు అన్ని వ్యవస్థలనూ వైసీపీ భ్రష్టుపట్టించిందని మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో ముఖ్యమంత్రి చేయని విధ్వంసం గత ఐదేళ్లలో జరిగిందన్నారు. డ్రెయిన్స్ , గేట్లు, షట్టర్లు, లాక్స్, రోప్స్ కు గ్రీజు వంటి కనీస మైంటనేన్స్ కూడా చేయలేదన్నారు. గత పాలనలో జరిగిన నష్టాలు పూడ్చుడానికి మంత్రులు, ఉద్యోగులు డబుల్ వర్క్ చేయాల్సి వస్తోందని అన్నారు. ఈ క్రమంలోనే 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేసే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఒకటి రెండు సంవత్సరాల్లో హంద్రీనీవా, వెలిగొండ, చింతలపూడి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాధాన్యత ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చే శక్తి ఇరిగేషన్ శాఖకే ఉందని పేర్కొన్నారు.

# టెట్ పరీక్షల్లో 83,711 మంది అభ్యర్థులు అర్హత



**హైదరాబాద్,**
రాష్ట్రంలో జనవరి 2 నుంచి జనవరి 20 వరకు 20 సెషన్స్‌లో టెట్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షలకు 2,05,278 మంది హాజరయ్యారు. వీరిలో రెండు పేపర్లు కలిపి 83,711 (40.78 %) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఇందులో పేపర్-1లో 69,476 మంది అభ్యర్థులకుగాను 41,327 (59.48 %) మంది క్వాలిఫై అయ్యారు. ఇక పేపర్-2లో మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 69,390 మంది పరీక్షకు హాజరుకాగా.. 23,755 (34.24 %) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. సోషల్ స్టడీస్ పేపర్‌లో 66,412 మందికిగాను.. 18,629 (28.205 %) మంది అర్హత సాధించారు. మొత్తానికి పేపర్-1, పేపర్-2 రెండూ కలిపి 2,05,278 మంది పరీక్షలకు హాజరుకాగా.. 83,711 మంది ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణలో టెట్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలతోపాటు ఫైనల్ ఆన్సర్ కీని విద్యాశాఖ విడుదల చేసింది. పేపర్లు, సబ్జెక్టులవారీగా అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్సర్ కీని అందుబాటులో ఉంచింది. ఆన్సర్ కీతోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు అందుబాటులో ఉన్నాయి. టెట్ పరీక్షలకు సంబంధించిన ప్రిలిమినరీ ఆన్సర్ కీని పాఠశాల విద్యాశాఖ జనవరి 24న విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థుల నుంచి జనవరి 25 నుంచి 27న సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించింది. టెట్ పరీక్షలకు సంబంధించి 150 మార్కులకు పేపర్-1, 150 మార్కులకు పేపర్-2 నిర్వహించారు. ఒక్కో పేపరులో 150 ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 5 విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగంలో 30 ప్రశ్నలు- 30 మార్కులు కేటాయించారు. ఇక పేపర్-1లో 4 విభాగాలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు విభాగాల్లో 30 ప్రశ్నలు- 30 మార్కులు, నాలుగో విభాగానికి 60 ప్రశ్నలు - 60 మార్కులు కేటాయించారు. పరీక్షల్లో అర్హత మార్కులను ఓసీలకు 90గా, బీసీలకు 75గా, ఎస్సీ-ఎస్టీ-దివ్యాంగులకు 60గా నిర్ణయించారు. తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్, పీజీ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించిన పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. త్వరలోనే దరఖాస్తు చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ ఫీజు ఇతర వివరాలతో కూడిన వివరణాత్మక నోటిఫికేషన్లను సంబంధిత సెట్ కన్వీనర్లు ప్రకటించనున్నారు. టీజీ ఎప్‌సెట్-2025 ఫిబ్రవరి 20న, పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల కానుంది.

# ప్రతీకారేచ్ఛలో మావోయిస్టులు

## -సామాన్య గిరిజనులపై దాడులు
## -ఇన్‌ఫార్మర్ నెపంతో వరుసగా హత్యలు



**రాయపూం**
గత కొన్ని నెలలుగా తగులుతున్న ఎదురు దెబ్బలకు మావోయిస్టులు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారా అన్న అనుమానం కలుగుతోంది. తమ అనుపానాలు పోలీసులకు ఎలా చేరుతున్నాయన్న కక్షలో అనుమానం ఉన్న వారిని మట్టుపెడుతున్నారు. ఇది వారిలో ఫ్రస్టేషన్‌కు కారణంగా చెప్పుకోవాలి. ఒక విధంగా చెప్పాలంటే ఏం చేయాలో అర్థంకాని స్థితిలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో గత కొన్ని నెలలుగా సామాన్యులపై కసి తీర్చుకుంటున్నారు. వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టులు పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. దీనికి దళాల సమాచారం పోలీస్‌లకు లీక్ కావడమే కారణమని మావోయిస్టులు భావిస్తున్నారు. అందుకే ఇలా ఊళ్లపై పడి హత్యలకు పాల్పడుతున్నారు. ఈ భయంతోనైనా ప్రజలు తమ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వకుండా ఉంటారని అనుకుంటున్నారు. మావోయిస్టుల ఇన్‌ఫర్మేషన్ పోలీసులకు అందిస్తున్నారని అనుమానిస్తున్నారు. అందుకే అనుమానం ఉన్న వారందర్నీ కాల్చి చంపుతున్నారు. తాజాగా మావోయిస్టులు మరోసారి ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనులను హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని టార్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. తమ వారిని చంపేందుకు వీళ్లు సహకరిస్తున్నారని మావోయిస్టులు ఈ హత్యలకు తెగపడ్డారు. తలాబ్ పారా బుడ్డి ప్రాంతంలో నివాసముండే కరమ్ రాజు (32), మద్వి మున్నా (27) అనే ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. వీళ్లే తమ పార్టీకి చెందిన నేతలు ఉండే ప్రాంతాల సమాచారాన్ని పోలీసులకు అందిస్తున్నారనే నెపంతో ఈ దురాఘతానికి పాల్పడ్డారు. మద్వి మున్నా, కరమ్ రాజు ఇళ్లలోకి అర్ధరాత్రి చొరబడి మావోయిస్టులు పదునైన ఆయుద్ధాలతో అతి కిరతకంగా గొంతు కోసి హత్య చేశారు. కుటుంబం సభ్యుల ముందే మావోయిస్టులు ఈ దారుణానికి పాల్పడ్డారు. తమ వారికి ఏ పాపం తెలియదు వదిలి పెట్టాలని వేడుకున్నా విడిచిపెట్టలేదు. వారు కాళ్లావేళ్ల పడినా కనికరించలేదు. రెండు హత్యలు చేసిన తర్వాత మావోయిస్టులు స్పాట్‌లో లేఖలు విడిచి పెట్టి వెళ్లారు. ఈ ఘటనతో బీజాపూర్ ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గిరిజనుల హత్యను పోలీసులు కూడా ధృవీకరించారు. ఘటనపై టార్రెమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే మావోయిస్టులు పోలీస్ ఇన్ ఫార్మర్ నెపంతో ముగ్గురిని హత్య చేశారు. ఆదివారం తెల్లవారు జామున మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా బహదూర్ ఘాట్ తాలుకలో మాజీ ఎంపిటీసీ మాడవ్వి (45) ని ఇలానే దారుణంగా హత్య చేశారు మావోయిస్టులు. పోలీస్ ఇన్ ఫార్మర్‌గా మారి దళాల సమాచారాన్ని పోలీస్‌కు అందిస్తున్నారని నెపంతో మాడవ్వి చితకబాది హత్య చేశారు. వరుస ఘటనలతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర దండకారణ్యంలో గిరిజన గూడేలు భయంతో వణికి పోతున్నాయి.44

# ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

## భక్తుల రిజిస్ట్రేషన్‌పై అధికారుల సమీక్ష



**న్యూఢిల్లీ,**
ఈ సంవత్సరం చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30న అక్షయ తృతీయ పండుగ నాడు ప్రారంభమవుతుంది. గంగోత్రి, యమునోత్రి ధామ్ తలుపులు తెరవడంతో యాత్ర ప్రారంభం అవుతుంది. బద్రీనాథ్ ఆలయ తలుపులు మే 4న తెరుచుకుంటాయి. కేదార్‌నాథ్ ధామ్ తెరిచే తేదీని మహాశివరాత్రి పండుగనాడు నిర్ణయిస్తారు. ఈ మేరకు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన యాత్ర నిర్వహణ కమిటీ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏప్రిల్‌లో ఉత్తరాఖండ్‌లో ప్రారంభమయ్యే చార్‌ధామ్ యాత్ర సందర్భంగా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు, ఇంటర్నెట్‌ను ఉపయోగించలేని యాత్రికులు ఎటువంటి సమస్యను ఎదుర్కోకుండా ఉండటానికి ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కూడా చేయబడుతుంది. చార్‌ధామ్ యాత్ర మార్గాల్లోని అన్ని పనులు ఏప్రిల్ 15 నాటికి పూర్తయ్యేలా చూడాలని పాండే ప్రజా పనుల శాఖను ఆదేశించారు. ఈసారి యాత్ర మార్గంలో ప్రతి పది కిలోమీటర్లకు చీతా పోలీస్ లేదా హిల్ పెట్రోలింగ్ యూనిట్ బృందాన్ని మోహరించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గర్వాల్ డివిజన్ రాజీవ్ స్వరూప్ కూడా సమావేశానికి హాజరయ్యారు. చార్‌ధామ్ యాత్ర కోసం దాదాపు రెండు వేల బస్సులను సిద్ధం చేశారు. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులకు యాత్ర ట్రస్ట్ గొప్ప శుభవార్త ప్రకటించింది. చార్‌ధామ్ యాత్రకు సంబంధించి యాత్ర ట్రాన్సిట్ క్యాంప్ ప్రాంగణంలో గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాత్ర పరిపాలన గత తప్పుల నుండి నేర్చుకుని, ఈసారి ప్రయాణీకుల నమోదు విధానాన్ని మార్చాలని నిర్ణయించిందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఈ ఇబ్బంది నుండి ఉపశమనం పొందేలా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు 40 శాతం ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్లు కూడా చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇబ్బంది పడకుండా ఉండటానికి 40 శాతం రిజిస్ట్రేషన్లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని పాండే చెప్పారు. గతసారి, ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ ఎంపిక అందుబాటులో లేకపోవడం వల్ల యాత్రికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. హిమాలయ దేవాలయాలకు సాంప్రదాయ ప్రయాణ క్రమాన్ని రిజిస్ట్రేషన్ తర్వాత యాత్రికులకు ఇచ్చిన స్లాట్‌లలో జాగ్రత్తగా చూసుకోవాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూసుకెళ్లాలా

(మొదటి తరువాయి)

కామారెడ్డి డిక్లరేషన్ కు అనుగుణంగా బీసీ కులగణన చేపట్టామని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతా చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ఉత్తర తెలంగాణలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేద్దామని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రాభవాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతీ స్థాయిలో విజయాన్ని సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. అలాగే సమస్యలపై ఎమ్మెల్యేలు నేరుగా తనను కలుసుకోవచ్చని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఏకగ్రీవ విజయం సాధించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిదర్శనంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిధుల కేటాయింపు కోసం తక్షణమే సంబంధిత మంత్రులను కలవాలని సూచించారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇది పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండేలా, బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తేవడానికి, వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకే ప్రతి నియోజకవర్గం స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ విజయానికి శ్రమించాలని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. బీసీ కులగణను శాస్త్రీయంగా చేపట్టామని, దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గాల స్థాయిలోనే కౌంటర్ అటాక్ చేయాలని సూచించారు. అదే విధంగా ఎస్సీ వర్గకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, చెప్పామని, దానిని అమలు చేసి చూపామని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వివరించేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఈ మేరకు సమావేశంలో నిర్ణయించారని సమాచారం. దీంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు ఏమైనా సమస్యలుంటే తన వద్దకు వచ్చి నేరుగా చెప్పుకోవచ్చని సీఎం చెప్పారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలపై ప్రతిపక్షాలు లేని పోని అపోహలు సృష్టిస్తున్నాయని, అదే స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా కౌంటర్ ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. ఇదలావుంటే ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన సీఎల్పీ సమావేశానికి బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, సంజయ కుమార్, కృష్ణమోహన్ రెడ్డి, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరు కాలేదు. అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేయడం, కేసు సుప్రీంకోర్టులో ఉండటం.. టెక్నికల్ గా ఏ సమస్యా రాకుండా ముందు జాగ్రత్త చర్యలగా వీరు గైర్హాజరైనట్టు సమాచారం.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దాదాపు ఐదున్నర గంటల పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వలసదారులను తిప్పి పంపడం కొత్తేమీ కాదు

(మొదటి తరువాయి)

2వేలకు పైగా ఉంది. అక్రమ వలసలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి. తమ దేశస్థులు విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం ఆయా దేశాల బాధ్యత‘ అని జైశంకర్ వివరించారు. తాజాగా అమెరికా 104 మంది భారతీయులను స్వదేశానికి పంపించడంపై ఈ మేరకు కేంద్రమంత్రి రాజ్యసభలో ప్రకటన చేశారు. వలసదారులకు సంకెళ్లు వేసి పంపిస్తున్నారని విపక్షాలు చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. డీపోర్టేషన్ సమయంలో వలసదారుల పట్ల దురుసుగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. అమెరికా నుంచి అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించే పక్రియను ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. వలసదారులను ఎయిర్‌క్రాఫ్ట్‌లో తరలించే విధానాన్ని 2012 నుంచి అమలు చేస్తుండగా.. నిబంధనల ప్రకారం వారిని నిర్బంధిస్తారు. టాయిలెట్‌కు వెళ్లే సమయంలో అవసరమైతే వాటిని తొలగిస్తారు. సైనిక ఎయిర్‌క్రాఫ్ట్, చార్టర్డ్ విమానాలకూ ఇది వర్తిస్తుంది. ఇందులో ఎటువంటి మార్పు లేదు. అయితే, మహిళలు, చిన్నారులను నిర్బంధించలేదని ఐసీఈ అధికారులు మాకు సమాచారం ఇచ్చారని ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో వారికి అవసరమైన ఆహారం, అత్యవసర వైద్య సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు. భారతీయులను అమెరికా వెనక్కి పంపించిన విధానాన్ని లేవనెత్తిన విపక్షాలు పార్లమెంటులో నిరసనలు చేపట్టాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. అమెరికా ప్రభుత్వ యంత్రాంగంతో తీసుకుంటున్న దౌత్యచర్యల గురించి వివరించాలని కోరాయి. దీనిపై లోక్‌సభ స్పీకర్ స్పందిస్తూ.. ఈ అంశం విదేశాంగ మంత్రిత్వశాఖకు సంబంధించినదని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించిందన్నారు. ఇలా ఉభయసభలకు అంతరాయం కలుగుతోన్న క్రమంలోనే రాజ్యసభలో కేంద్ర మంత్రి దీనిపై ప్రకటన చేశారు.

దీనికి ముందు జైశంకర్ ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. మరోవైపు, వలసదారుల భద్రత కోసం కేంద్రం కొత్త చట్టం తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులు బుధవారం అమృత్‌సర్‌లో దిగారు. వారిని అమానవీయ పరిస్థితుల్లో తరలించారంటూ విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధానితో విదేశాంగ మంత్రి భేటీ అయ్యారు. ఇక ప్రతిపక్ష ఎంపీల నిరసనలతో ఉభయ సభల కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దిగువసభ మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడింది. ఈ అంశంపై మంత్రి పార్లమెంట్‌లో ప్రకటన చేయనున్నారు. అలాగే విదేశాల్లో ఉన్న భారత విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. ప్రస్తుతం వలసదారులు వెనక్కి రావడంతో కేంద్రం వారి భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకువచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. విదేశాల్లో ఉపాధి కోసం సురక్షితమైన, క్రమబద్ధమైన వలసలను ప్రోత్సహించేలా ఈ కొత్త చట్టంలో విధివిధానాలు ఉండనున్నట్లు సమాచారం. ‘గతంలోనూ భారత వలసదారులను స్వదేశానికి తరలించారు. కానీ ఈవిధంగా మాత్రం జరగలేదని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ అన్నారు. మన పౌరుల చేతికి బేడీలు వేయడం అవమానకరం‘ అని థరూర్ విమర్శలు చేశారు. భారత వలసదారులచేతులకు సంకెళ్లు.. కాళ్లకు గొలుసులు వేసి స్వదేశానికి పంపించినట్లు కొన్ని దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో ఇదికాస్తా రాజకీయ వివాదానికి దారితీసింది. ఈనేపథ్యంలో కేంద్రం దీనిపై స్పందించింది. ఆ ఫొటోల్లో ఉన్నది భారతీయులు కారని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ డిపార్ట్‌మెంట్ ఆ ఫొటోలపై నిజ నిర్ధరణ పక్రియ చేపట్టింది. అందులో అవి ’ఫేక్’ అని తేలినట్లు పీఐబీ వెల్లడించింది.

# విసిల నియామకంలో యూజిసి పెత్తనం సరికాదు

(మొదటి తరువాయి)

గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ‘నూతన నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుంది. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం అధీనంలోకి తీసుకోవాలనుకుంటున్నారు. యూజీసీ నిబంధనల అభ్యంతరాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని విన్నవించాం. మరోవైపు ఎన్‌హెచ్–365బి రహదారిని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామని కేటీఆర్ తెలిపారు.‘‘ కటిఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసింది. యూజీసీ ముసాయిదా నిబంధనలపై కేంద్రానికి బీఆర్ఎస్ నేతలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆ తర్వాత 365బీ జాతీయ రహదారిని సూర్యాపేట–సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు విస్తరించాలంటూ నితిన్ గడ్కరీని కోరింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. నూతన నిబంధనలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. మా అభిప్రాయాలు తెలియజేసేందుకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను రాష్ట్ర గవర్నర్ల ద్వారా కేంద్రం నియంత్రించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరూద్ధమన్నారు. సెర్చ్ కమిటీల బాధ్యతలను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ.. కొత్త నిబంధనలు రూపొందించారని.. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకుంటుందని ఆరోపించారు. నూతన నిబంధనలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. యూజీసీ నిబంధనలపై అభ్యంతరాలను ఆరు పేజీలతో నివేదిక కేంద్రమంత్రికి ఇచ్చినట్లు వివరించారు.

# తెలంగాణకు గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం

(మొదటి తరువాయి)

అర్హత పొందింది. అంతే కాకుండా.. మోటార్ వెహికల్ ట్యాక్స్ కన్సెషన్ పథకం కింద తెలంగాణ రూ.50 కోట్లు అర్హత సాధించింది. మైల్ స్టోన్ –2 కింద రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాలు పైబడిన రవాణా వాహనాలను తొలగించేందుకు స్క్రాపింగ్ ప్రణాళికను పంపించింది. ఈ స్క్రాపింగ్ పథకంతో మరో రూ.75 కోట్లు అర్హత సాధించింది. రాష్ట్రంలోని మొత్తం జిల్లాలలో 21 జిల్లాలు ప్రాధాన్యతగా తీసుకుని పని చేయడం ద్వారా తెలంగాణ రూ.31.5 కోట్లు అర్హత పొందింది. ప్రాధాన్యత లేని జిల్లాలకు రూ.20 కోట్లు పొందేందుకు అర్హత పొందింది. ఈ మైలురాయి కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ.51.5 కోట్లు. ఈ ఆర్థిక సాయం రాష్ట్రంలో రవాణా రంగం అభివృద్ధికి ఉపయోగపడనుంది. ఇంతలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి అనుసంధానించే లింక్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానితో అనుసంధానించే రోడ్లు, ప్రస్తుత రహదారి మౌలిక సదుపాయాల అప్ గ్రేడ్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించబడిన పనులను చేపట్టడంలో నియమాలను పాటించాలని మంత్రి అధికారులను కోరారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్లకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లను గుర్తించాలని ఆదేశించారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టిన రోడ్ల పురోగతిని సమీక్షించడానికి సీనియర్ ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమైన మంత్రి.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# అంబేద్కర్‌ను ఏనాడూ గౌరవించని కాంగ్రెస్

(మొదటి తరువాయి)

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని మారోసారి టార్గెట్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినదంతా.. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించేదని అన్నారు.. బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని ఆరోపించారు, సామాజిక సంస్కర్త పట్ల ఆ పార్టీ దారుణంగా ప్రవర్తించిందన్నారు.. అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించలేదు.. అంబేద్కర్‌ను ఓడించేందుకు కుట్రలు చేసిందని విమర్శించారు.. కానీ, ఇప్పుడు ఓట్ల కోసం జై భీమ్ నినాదాలు చేస్తోంది.. కాంగ్రెస్ రంగులు మార్చే పార్టీ అని దుయ్యబట్టారు.. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక వెనుకబాటు తనాన్ని అంబేద్కర్ తొలగించాలని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ఆ పని చేయలేకపోయిందన్నారు.. కాంగ్రెస్ బీఆర్ అంబేద్కర్‌తో దారుణంగా వ్యవహరించింది? వారు ఆయనను వ్యతిరేకించారు.. బాబాసాహెబ్ చెప్పినదంతా కాంగ్రెస్‌ను వ్యతిరేకించేది అని ప్రధాని మోడీ అన్నారు. ప్రతిదానికీ డాక్యుమెంట్స్ ఎవిడెన్స్ ఉన్నాయి.. వాటిని ధృవీకరించవచ్చన్న ఆయన.. ఎన్నికల్లో బాబాసాహెబ్ ఓడిపోయేలా కాంగ్రెస్ ఎటువంటి రాయిని వదిలిపెట్టలేదన్నారు.. ఎందుకంటే వారు ఆయనను సహించలేక పోయారు. భారతరత్నకు ఆయన అర్హుడని భావించలేదు అంటూ ఫైర్ అయ్యారు.. సబ్ కా సాత్ కాంగ్రెస్‌కు సాధ్యం కాదు అని స్పస్టం చేశారు.. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనేది కాంగ్రెస్ పార్టీకి అర్థం కాని విషయం అని పేర్కొన్నారు.. కాంగ్రెస్ విషయానికొస్తే? వారు సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ ఆశించడం పెద్ద తప్పు? అది వారి ఆలోచనలకు అతీతమైనది.. వారి రోడ్ మ్యాప్ కు కూడా సరిపోదు.. ఎందుకంటే అది ఒక పెద్ద పార్టీ.. ఒక రాజవంశానికి అంకితం చేయబడింది కాబట్టి.. వారికి సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ సాధ్యం కాదు అని విమర్శించారు.

# యూజిసి నిబంధనలు దేశ సంస్కృతిపై దాడి

(మొదటి తరువాయి)

ఒకే చరిత్ర, ఒకే సంప్రదాయం, ఒకే భాష విధించాలనే ఆలోచనతోనే వారు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని అన్నారు. వివిధ రాష్ట్రాల విద్యా వ్యవస్థపై వారు చేస్తున్న ఈ ప్రయత్నం తమ ఎంజెడాను ముందుకుతీసుకెళ్లేందుకే అని రాహుల్ విమర్శించారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రవేశపెట్టిన నూతన ముసాయిదా నిబంధనలు భాజపాయేతర రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ముసాయిదాకు వ్యతిరేకంగా డీఎంకే విద్యార్థి విభాగం గురువారం దిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసనలకు దిగింది. ఈ నిరసనలో డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధితో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. యూజీసీ ప్రవేశపెట్టిన ముసాయిదాను తాము వ్యతిరేకిస్తున్నట్లు అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఈ నూతన విధానం యూనివర్శిటీలను పారిశ్రామికవేత్తలకు అప్పగించే కుట్రగా ఆయన పేర్కొన్నారు. ఈ విధానానికి తాము ఎప్పటికీ మద్దతు ఇవ్వబోమన్నారు. వర్శిటీలు, కళాశాలల్లో అధ్యాపకులు, బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు–2025 పేరిట యూజీసీ ఇటీవల ఓ ముసాయిదాను విడుదల చేసింది. అందులోని పలు అంశాలు బాగా వివాదాస్పదమవుతున్నాయి. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాల అధిపతులైన ఉపకులపతుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలో ఉంది. నూతన ముసాయిదా ప్రకారం ఆ అధికారం ఛాన్సలర్లుగా ఉన్న గవర్నర్ల చేతుల్లోకి వెళ్తుంది. ఈ మార్పును భాజపాయేతర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. తమిళనాడు, కేరళ వంటివి ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ చట్టసభల్లో తీర్మానం కూడా చేశాయి.

# కులగణనపై విపక్షాల విమర్శలు తిప్పికొట్టాలి

(మొదటి తరువాయి)

ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశాలు నిర్వహించుకోవటం తప్పేమీ కాదని కూడా అన్నారు. సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చించామని తెలిపారు. ‘స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించాం. సమావేశంలో ఎమ్మెల్యేలు కూడా వారి అభిప్రాయాలు చెప్పారు. పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. సుమారు మూడు గంటలకు పైగా సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించామని అన్నారు. ఈ క్రమంలో సమావేశంలో చర్చించిన అంశాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. .స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన చేపట్టామని... రాహుల్ గాంధీ ఆశయం మేరకు పరిపూర్ణంగా సర్వే చేసి ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారో తేల్చామని అన్నారు. వాస్తవాలు తెలియక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ బీసీ సంఘాలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. చాలా అంశాలపై సీఎల్పీ సమావేశం జరిగిందని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సూర్యాపేటలో కులగణన జరిగిన తీరుపై బహిరంగ సభ నిర్వహించ నున్నామని.. ఈ సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను ఆహ్వానించటానికి ఢిల్లీ వెళ్తున్నామని అన్నారు. ఈ సమావేశం ద్వారా ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలు నివృత్తి చేశామని అన్నారు. బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే కేటిఆర్ ఢిల్లీ వెళ్లారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# 12 నుంచి మినీమేడారం జాతర

(మొదటి తరువాయి)

సంగతి తెలిసిందే. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం ఈ నెల 12 నుంచి మినీ మేడారం జాతర ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు 4 రోజుల పాటు మినీ మేడార జాతర జరగనుంది. బుధవారం మినీ మేడారం జాతరకు అంకురార్పణ జరిగింది. అంటే జాతర ప్రారంభానికి సరిగ్గా వారం రోజుల ముందు గుడి మెలిగె, మండ మెలిగె పండుగను నిర్వహిస్తుంటారు. ఈ నెల 12న జాతర ప్రారంభం కానుండటంతో పూజారులు బుధవారం గుడి మెలిగె పండుగకు శ్రీకారం చుట్టారు. బుధవారం మేడారంలో గల సమక్క ఆలయంలో సిద్ధబోయిన వంశస్థులు, కన్నెపల్లలోని సారలమ్మ ఆలయంలో కాక వంశీయులు గుడి మెలిగె పండుగను నిర్వహించారు. ఈ గుడి మెలిగె పండుగలో భాగంగా పూజారులు గుడిని శుద్ధి చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి డోలు వాయిద్యాలతో అటవీప్రాంతంలోకి వెళ్లి గుట్టగడ్డిని తీసుకువచ్చారు. గడ్డికి పసుపు, కుంకుమలతో పూజలు చేసిన అనంతరం పూజామందిరాన్ని అలంకరించారు. ఈ మండమెలిగె, గుడి మెలిగె పండుగతో మినీ మేడారం జాతర ప్రారంభమైనట్లేనని పూజారులు వెల్లడించారు.

## సంపాదకీయం

# రాజకీయాల్లో కూడా మాదిగలకు రిజర్వేషన్లు దక్కాలి !

ఎస్సీ వర్గీకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఇదో చారిత్రక నిర్ణయంగానే చూడాలి. అయితే కేవలం ఉద్యోగాల్లో మాత్రమే గాకుండా ప్రథమంగా రాజకీయ రిజర్వేషన్లు దక్కాలి. అది కూడా ఎల్లకాలం ఒకే కుటుంబానికి ఎస్సీ రిజర్వేషన్లు దక్కరాదు. అంతేగాకుండా ఒకే కుటుంబం రిజర్వేషన్లు తన్నుకుపోవడం కూడా సరికాదు. నిజానికి నిజమైన ఉద్యమం ఇక్కడే మొదలు కావాలి. మందకృష్ణ వీలయితే రాజకీయ ఉద్యమం మొదలు పెట్టాలి. రాజకీయ పదవుల్లో రిజర్వేషన్లు రావాలన్న నినాదం ఎత్తుకోవాలి. తెలంగాణలో తీసుకుంటే కాకాగా పేరున్న వెంకటస్వామి కుటుంబమే మూడు రాజకీయ పదవులు పొందింది. ఇదో రకంగా రిజర్వేషన్లను అపహాస్యంచేయడమే. ఇది ఒకక ఎస్సీల్లోనే కాదు..అన్ని స్థానాల్లో కుటుంబానికి ఒక్కటే సీటు అన్న నినాదం రావాలి. నినాదం కాస్తా రాజ్యాంగ నిర్ణయం కావాలి. కేంద్రంలోసోనియా కుటుంబంలో మూడు పదవులు అంటే ముగ్గురు ఎంపిలుగా ఉన్నారు. తెలంగాణలోనే కెసిఆర్ కుటుంలో నలుగురై దుగురు, చంద్రబాబు కుటుంబంలో నలుగురైదుగురు ఉంటున్నారు. ఓవైసీ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల్లో ఇద్దరికిద్దరు జీవితాంతం ఎంపిగా, ఎమ్మెల్యేగా ఉంటున్నారు. ఇలాంటి వాటిపై ఆంక్షలు ఉండాలి. ఒకే కుటుంబ మూలాలు ఉన్న వారికి ఒక్కటే సీటు అన్న రాజ్యాంగ నిర్ణయం రావాలి. ఒక్కరు రెండు పర్యాయాలకు మించి రాజకీయ పదువులు పొందకుండా చూడాలి. ఎస్సీవర్గీకరణ నేపథ్యంలో ప్రజలంతా ఇలాంటి పోరాటాలు చేయాలి. వేల ఏళ్లుగా షెడ్యూల్డ్ కులాలు అట్టడుగు స్థాయిలో ఉంటున్నారు. వీరంతా వేల సంవత్సరాలనుంచి సామాజిక హక్కులు దక్కకుండా అస్పృశ్యత, అంటరాని తనాన్ని అనుభవించారు.వారికి రాజకీయంగా కూడా పదవులు గట్టిగా దక్కడం లేదు. దక్కినా బిచ్చం మాదిరిగా వేస్తున్నారు. రిజర్వేషన్లు ఉండబట్టి వీరంతా అక్కడక్కడా కొంత ప్రాతినిధ్యం పొందుతున్నారు. రాజ్యాంగంలో15 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అయితే ఈ రిజజర్వేషన్లు కూడా కొందరికే దక్కుతు న్నాయి. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ కారణంగా కొంత మెరుగు పడవచ్చు. మాదిగ ఉపకులాల్లో మరీ అధ్వాన్నంగా ఉన్న వారెందరో ఉన్నారు. షెడ్యూల్డ్ కులాల్లో (ఎస్‌సి)59 ఉపకులాలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇందులో ప్రధానంగా ఉన్న కులాలు మాదిగ, మాలలు. ఇందులోనూ మాలలే ఎక్కువ శాతం రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు. జనాభాపరంగా అత్యధికంగా ఉన్నప్పటికీ సామాజికంగా బాగా వెనుకబడ్డ కులం మాదిగ వర్గం మాత్రమే. మాదిగ కులంలోనూ ఇంకా అట్టడుగు స్థాయికి చెందిన దక్కలి వంటి వారు ఉన్నారు. మెజారిటీ జనాభా గల మాదిగ కులానికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లలో తగిన వాటా దక్కకపోవడమే కారణంగానే మందకృష్ణ ఉద్యమించాల్సి వచ్చింది. కానీ రాజకీయాలు పెత్తందార్లు, ఉన్నత వర్గాల చేతుల్లో ఉన్న కారణంగా మాదిగల రిజర్వేషన్ పోరాటం మూడు దశాబ్దాలుగా కొనసాగింది. వీరి మధ్య అసమానతల నేపథ్యంలో మాల, మాదిగల మధ్య వైరుధ్యం పెరిగింది. అందుకే తమజాతికి న్యాయం జరగాలన్న పట్టుదలతో మంద కృష్ణమాదిగ నేతృత్వంలో 1994న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమం మొదలైంది. దీంతో అనాటి ఉమ్మడి ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1996లో వర్గీకరణ అంశంపై జస్టిస్ పి.రామచంద్ర రాజు కమిషన్ నియమించారు. ఈ కమిషన్ షెడ్యూల్డ్ కులాల్ని వెనకబాటుతనం ఆధారంగా ఎ, బి, సి, డిలుగా వర్గీకరణ చేయాలనీ సిఫార్సు చేసింది. ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణను విద్య, ఉద్యోగాల్లో వర్తింప చేయాలని సూచించింది. ఈ కమిషన్ నివేదిక మేరకు 2000 నుంచి అమలు పరిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌సి ఉప వర్గీకరణను సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో 2004లో కొట్టివేశారు. దీంతో మాదిగ ఉప కులాలు నిరసన వ్యక్తం చేసి, వర్గీకరణ చట్టబద్ధతకై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం 2007లో ఉషా మెహ్రా కమిషన్‌ను నియమించినది. ఈ కమిషన్ కూడా రిజర్వేషన్ల వర్గీకరణ అవసరమని నొక్కి చెప్పింది. కానీ ప్రభుత్వాలు ఓట్ల రాజకీయం కోసం ఇన్నాళ్లు దాటవేశారు. అయినా చివరకు పోరాటానికి గుర్తింపు దక్కింది. సుప్రీంకోర్టు కూడా ఈ విషయంలో వాస్తవాలు గుర్తించి వర్గీకరణకు ఆమోదం ఇచ్చింది. సుప్రీం కోర్టు తీర్పులో ఎస్‌సి కులాల్లో ఎక్కువ, తక్కువలున్నాయని దేశం గుర్తించింది. సామాజిక, ఆర్థిక స్థితిగతుల గణాంకాలు సేకరించి, వాటి ఆధారంగా ఉపవర్గీకరణ చేయాలనీ స్పష్టం చేసింది. మాదిగలు కన్నా తక్కువ సంఖ్యా బలం ఉన్న మాలల ఇంతకాలం రిజర్వేషన్‌లను అనుభవించారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అధ్యయనం చేసిన తెలంగాణ ప్రభుత్వం , తీర్పును అమలు చేసేందుకు అసెంబ్లీ వేదికగా చర్చించి ఆమోదించడం శుభపరిణామం. ఈ క్రమంలో వీరికి రాజకీయంగా కూడా రిజర్వేషన్లు దక్కాల్సి ఉన్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల్సి ఉంది. కేంద్రం కూడా రాజకీయ రిజర్వేషన్లలో వీరి వాటాను గుర్తించి రాజ్యాంగ సవరణలు చేస్తే మరీమంచిది. పనిలో పనిగా రాజకీయ రిజర్వేషన్లలో మార్పులు తీసుకుని రావాల్సిన ఆగత్యం గుర్తించాలి. ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణతోనే దళితుల్లో సామాజిక న్యాయం సాధ్యం కాదు. దీన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలి. అన్ని రంగాలలో వీరిని ముందుకు తీసుకువెళ్లాలి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన ఎస్‌సి వర్గీకరణను విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లో కూడా వీరికి ప్రాధాన్యం దక్కేలా చేయాలి. ప్రభుత్వ పథకాలలో,కార్పొరేషన్ లోన్లలో కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. జనాభా దామాషా, వెనుకబాటు ఆధారంగా జరుగుతున్న ఈ ఎస్‌సి వర్గీకరణను రాజకీయాల్లో కూడా దక్కినప్పుడే సంపూర్ణంగా న్యాయం చేకూరగలదు.

# కులాల సంగతులతోనే సర్వేకు సార్థకత!

షెడ్యూల్ కులాల (ఎస్సీలు) వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుని తెలంగాణ ప్రభుత్వం ఒక ముందడుగు వేసింది. నిస్సందేహంగా స్వాగతించాల్సిన పరిణామం ఇది. 30 ఏళ్లుగా వివిధ రూపాల్లో తెలుగునాట అనేక ఆందోళనలకు కారణమై ఎన్నో చిక్కుముడులున్న సమస్య పరిష్కారానికి ఒకదారి ఏర్పడింది. ఏ జటిల సమస్యకైనా నూటికి నూరుపాళ్లు అందరికీ ఆమోదకరమైన పరిష్కారం ఉండదు. మొత్తం ఎస్సీలను మూడు సమూహాలుగా చేసి 1, 9, 6 శాతం చొప్పున రిజర్వేషన్లను కేటాయించటంపై అసంతృప్తులూ అసమ్మతులూ ఇప్పటికే కొన్ని వినిపిస్తున్నాయి. ఇవి రానున్న రోజుల్లో ఏ రూపం తీసుకుంటాయో ఇప్పుడే చెప్పలేం. కాలక్రమేణా సద్దుమణగనూ వచ్చు. కొత్త వాదనలతో కొంత కాలం కొనసాగనూ వచ్చు! ఏ సామాజిక సమస్యా నిరంతరం వాద ప్రతివాదాలతో, సంఘర్షణాత్మకంగా కొనసాగాలని ఎవ్వరమూ కోరుకోం. సమస్యలను సాధ్యమైనంతమేరకు తక్కువ అసమ్మతితో పరిష్కరిస్తూ ముందుకు వెళ్లాలనే అనుకుంటాం. వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని చెబుతూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు కొన్ని హెచ్చరికలనూ షరతులనూ పెట్టింది. కుల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించకూడదన్నది అందులో ప్రధానమైంది. రిజర్వేషన్లు వర్తింపచేసే అన్ని రంగాల్లో ఒక కులం బాగా వెనుకబడి ఉందని గణాంకాల ఆధారంగా నిర్ధారించుకుని ఆ వెనుకబాటుని అధిగమించటానికి ఎంత శాతం రిజర్వేషన్లు అవసరమో అంత శాతం మాత్రమే ఉండేలా చూడాలనీ స్పష్టంచేసింది. జనాకర్షణ రాజకీయాల కోసం రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించకుండా ముందుగా కట్టడి చేసే ఉద్దేశంతో సుప్రీంకోర్టు దీన్ని నిర్దిష్టంగా పేర్కొంది. ఒకవేళ ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా దీనికి భిన్నంగా రిజర్వేషన్ల శాతాలను నిర్ణయిస్తే కోర్టుకు రావచ్చనీ స్పష్టంచేసింది. న్యాయ సమీక్ష ముందు రిజర్వేషన్ల శాతాలు నిగ్గుతేలాల్సి వస్తుందనీ హెచ్చరించింది. ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడాల్లేకుండా జనాకర్షణ, ఓట్ల రాజకీయాల కోసం నిర్హేతుక నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు పెట్టిన షరతులూ చేసిన హెచ్చరికల్లో ఔచిత్యం లేదని అనుకోలేం. ఈ నేపథ్యంలో వర్గీకరణ సమస్యపై జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక మొత్తాన్ని ప్రజల ముందు పెట్టి ఉంటే సముచితంగా ఉండేది. నివేదికలో ప్రధాన అంశమైన రిజర్వేషన్ల శాతాన్ని ఆమోదించిన తర్వాత ఆలస్యం చేయాల్సిన



అవసరం ప్రభుత్వానికి ఉండకూడదు. రిజర్వేషన్ల శాతం నిర్ధారించటానికి ప్రాతిపదికగా ఉన్న సమస్త సమాచారాన్ని వెంటనే బయటపెట్టటం వలన అపోహలూ అపార్థాలూ తొలగిపోతాయి. సరైన గణాంకాలు ఉండకపోవటం మన సమాజంలో పెద్ద సమస్య. ప్రజాధనాన్ని ఎంతో ఖర్చుపెట్టి సేకరించిన గణాంకాలను అ ప్రజలకే వెల్లడించని సంఘటనలు మనకు చాలా ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేనే దీనికి నిదర్శనం. ఎంతో ఆర్భాటంగా, దేశంలోనే కనీవినీ ఎరగని రీతిలో సర్వేని చేపడుతున్నామని చెప్పి దాని గురించి అధికారికంగా ఒక్కమాటైనా మాట్లాడకుండా ఏళ్లపాటు మౌనం వహించటాన్ని ప్రజాస్వామిక నైతికత దృష్ట్యా ఏ మాత్రం సమర్థించలేం. ఎన్నో వైపుల నుంచి ఎందరో ఆ సర్వే ఫలితాలు వెల్లడించాలని కోరినా ఏళ్లపాటు కిమ్మనలేదు. వర్గీకరణపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా దాన్ని చక్కటి రంగులతో, గ్రాఫ్‌లతో కూడిన సంక్షిప్త నివేదికను అనధికారికంగా అందరికీ అందుబాటులోకి తెచ్చారు. రాజకీయాల కోసం సర్వేలను సమయానుకూలంగా దాచిపెట్టటమూ వెల్లడిచేయటమూ చేస్తారనటానికి ఇంతకంటే నిదర్శనం ఉండదు. విద్య, ఉద్యోగాలు, పదవుల్లో వివిధ కులాలకు దక్కిన ప్రాతినిధ్యంపై 1990ల నుంచి రాజకీయంగానూ ఇతరత్రానూ విపరీతంగా చర్చలు జరుగుతున్నాయి. వర్గీకరణ సమస్య కూడా ఆ చర్చల నుంచి ఊపిరిపోసుకుని ఆందోళనబాటను తీసుకుంది. వివిధ స్థాయి ఉద్యోగాల్లో మాల, మాదిగలతో పాటు ఇతర చిన్నకులాలకు దక్కిన ప్రాతినిధ్యం వెల్లడైతే మన సమాజంలో మార్పుల తీరుతెన్నులూ తెలుస్తాయి. వివిధ కులాలకు దక్కిన ఉద్యోగాల గురించి రాజకీయంగా చేసే వాదనలు, ప్రచారాలు స్థూలంగా నిజాలు కావచ్చు. కానీ స్థూల సమాచారం ఎప్పటికీ నిర్దిష్ట వివరాలకు సమానం కాదు. అందుకే ఉద్యోగాల్లోనూ, ప్రభుత్వం నుంచి సహాయం అందుకున్న పథకాల్లోనూ ఎవరు ఎక్కడున్నారో తెలియటం సామాజిక న్యాయం దృష్టితో చూస్తే చాలా అవసరం. ఎస్సీల వర్గీకరణ సమస్య ఉమ్మడి రాష్ట్రంలో ఊపిరిపోసుకుంది. కులగణన సమస్య అలా కాదు. దేశవ్యాప్తంగా కులగణన అవసరంపై ఉధృతంగా ప్రచారం చేసి దాన్నొక రాజకీయ అజెండాగా పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతోంది. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ కులగణన గురించి మాట్లాడని రోజులేదు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిపోయిన ఉన్నతాధికార వర్గంలో గుప్పెడుమంది బీసీల తలరాత రాస్తున్నారనీ అనేక సందర్భాల్లో విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టి సామాజిక న్యాయానికి చరిత్రాత్మక రీతిలో స్వీకారం చుట్టి దేశగతినే మార్చివేస్తామనీ చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కులగణన విషయంలో ముందుండి మార్గదర్శకంగా నిలబడతాయని కూడా ప్రకటనలు చేశారు. ఇందులో భాగంగానే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను పూర్తిచేసింది. కొంతమేరకు ఫలితాలను వెల్లడించింది. సమాచారం పాక్షికంగా వెల్లడించటంతో తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని ఇప్పటికి పూర్తిగా తెలుసుకునే అవకాశం లేదు. ఒక్క కులాల వారీ జనాభాకే పరిమితం కాకుండా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయపరమైన వివరాలను సమగ్రంగా వెల్లడిస్తారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెప్పారు. గోప్యత దృష్ట్యా వ్యక్తిగత వివరాలు వెల్లడించలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పటాన్ని ఒకకోణం నుంచి విమర్శించలేం! ఫలానా వ్యక్తికి ఇన్ని ఆస్తులు ఉన్నాయి.. ఇన్ని వాహనాలు ఉన్నాయి.. ఇన్ని భూములు ఉన్నాయి. ఇన్ని భవనాలు ఉన్నాయి.. అని పేరుతో సహా వెల్లడిస్తే సమస్య వస్తుంది. గోప్యతకు భంగం కలుగుతుంది. కులాల వారీ జనాభా ఇవ్వటానికీ ఏ కులం వారు ఉద్యోగాల్లో ఎంత మంది ఉన్నారో చెప్పటానికీ వివిధ స్థాయిల్లో రాజకీయ పదవుల్లో ఎందరున్నారో తెలపటానికి అభ్యంతరం ఏమిటో అర్థం కాదు.

# వాణిజ్య పోరుకు తెర తీసిన ట్రంప్

డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల ముందు నుంచీ ప్రకటించినట్లుగానే ప్రపంచ వాణిజ్య పోరుకు తెర తీశాడు. తన పన్నులను వ్యతిరేకించే విదేశమైనా లేక అమెరికాలో ఉన్న కంపెనీ అయినా సరే వారంతా చైనా అదుపులో ఉన్నట్లే అన్నాడు. ఇది రాసిన సమయంలో చెప్పిన మాటలకు, పాఠకులకు చేరే సమయానికి మార్పులు, విస్తరణ జరిగే రీతిలో ట్రంప్ వేగం కనిపిస్తోంది. కెనడా, మెక్సికోల మీద విధించిన పన్నుల అమలు కొంత కాలం వాయిదా వేస్తామనటంతో పాటు 'ఐరోపా మీద త్వరలో విధిస్తా, వారు అమెరికా పట్ల భయంకరంగా వ్యవహరించారు, లాభాలకు ఒక అవకాశంగా తీసుకున్నారు, చైనా మీద ప్రకటించిన మొత్తాన్ని పెంచుతా' అన్నాడు. స్వంత జనాలు, కంపెనీలతో పాటు ప్రపంచ వృద్ధికి నష్టం. అమెరికా పలుకుబడికీ దెబ్బ అన్న అనేక మంది ఆర్థికవేత్తల హెచ్చరికలను ఖాతరు చేయటం లేదు. కెనడా, మెక్సికోలపై 25 శాతం, చైనా వస్తు దిగుమతుల మీద పది శాతం పన్ను విధిస్తూ ఫిబ్రవరి ఒకటవ తేదీన ఉత్తర్వులు జారీ చేశాడు. ఇప్పటి వరకు వెల్లడైన వైఖరులను చూస్తే అదిరించి బెదిరించి దారికి తెచ్చుకోవాలన్న ఎత్తుగడ కనిపిస్తోంది. పన్నులను వ్యతిరేకిస్తున్న వారు ఎవరైనా కుహనా వార్తల వాల్‌స్ట్రీట్ జర్నల్, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే (హెడ్జ్ ఫండ్స్) వారు లేదా సంస్థలు చైనా అదుపుల్లో ఉన్నట్లే అన్నాడు. తన నిర్ణయాలకు అద్భుత స్పందన వస్తున్నదని చెప్పుకున్నాడు. ఇతర దేశాలకు రాయితీల రూపంలో అమెరికా లక్షల కోట్ల డాలర్లు నష్టపోతున్నదన్నాడు. జనాలకు ఆర్థికంగా కొంత నొప్పి కలగవచ్చుగానీ అమెరికా ప్రయోజనాలకు ఆ మాత్రం భరించక తప్పదన్నాడు. దక్షిణాఫ్రికా భూములను గుంజుకుంటున్నదని, కొన్ని సామాజిక తరగతుల పట్ల చెడుగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ఆ దేశానికి రానున్న రోజుల్లో నిధులు నిలిపివేస్తామని, గతంలో ఇచ్చిన వాటి మీద దర్యాప్తు చేస్తామని చెప్పాడు. ఖండనలతో పాటు యావత్ ప్రపంచం అప్రమత్తమై




ఎలా ఎదుర్కోవాలా అన్న శోధనలో పడింది. అక్రమంగా దిగుమతి అవుతున్న ఫెంటానిల్ నిరోధానికి జాతీయ అత్యవసర పరిస్థితిని ట్రంప్ ప్రకటించాడు. కృత్రిమ సింథటిక్, నల్లమందుతో తయారు చేసే నొప్పి నివారణ, మత్తు మందును ఫెంటానిల్ అని పిలుస్తున్నారు. దీన్ని ఔషధంగా వినియోగించటానికి అనుమతి ఉంది. మాదక ద్రవ్యంగా కూడా వినియోగిస్తున్నారు. అక్రమంగా దిగుమతి అవుతున్న ఫెంటానిల్ అమెరికాలో లక్షల మంది ప్రాణాలు తీసిందని అధ్యక్ష భవన మీడియా కార్యదర్శి కారోలిన్ లీవిట్ ఆరోపించారు. డోనాల్డ్ ట్రంప్ అంటే అమెరికా, అమెరికా అంటే ట్రంప్ అన్నట్లుగా పరిస్థితి తయారు కావటంతో కొంత మంది ఇప్పుడు 'ట్రంపెరికా' అని పిలుస్తున్నారు. తాము చర్చలను తప్ప ఘర్షణను కోరుకోలేదని, కానీ ప్రతికూల చర్యలకు పూనుకోక తప్పటంలేదని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షియిన్‌బామ్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. మెక్సికో ప్రయోజనాల రక్షణకు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకోవాలని తమ ఆర్థిక మంత్రిని కోరినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల ముఠాలతో మెక్సికో ప్రభుత్వం కుమ్మక్కు అయినందునే తాము పన్నులు విధించాల్సి వస్తోందంటూ అధ్యక్ష భవనం చెప్పిన సాకును ఆమె ఖండించారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఏఏ వస్తువులను లక్ష్యంగా చేసుకోవాలో ఇంకా వెల్లడించలేదు. స్వతంత్ర మెక్సికో చరిత్రలో జరిగిన అతి పెద్ద దాడులలో ఇదొకటని, అమెరికా–కెనడా–మెక్సికో కుదుర్చుకున్న ఒప్పందానికి ఇది విరుద్ధమని పాలక పార్టీ నేత రికార్డో, ఆర్థిక మంత్రి ఎబ్రార్డ్ ప్రకటించాడు. తాము నష్టపడతామని, వారికీ అదే జరుగుతుందన్నారు. ప్రస్తుతం అమెరికాకు ఎగుమతుల్లో చైనాతో మెక్సికో పోటీ పడుతోంది. మూడో వంతు మెక్సికో జిడిపి అమెరికాకు ఎగుమతులపై ఆధారపడి ఉంది. ఎగుమతి, దిగుమతుల్లో మెక్సికో వాణిజ్య మిగుల్లో ఉంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే పంది మాంసం, జున్ను, వ్యవసాయ ఉత్పత్తులు, ఉక్కు, అల్యూమినియం వస్తువుల మీద ఐదు నుంచి 20 శాతం వరకు పన్నులు విధించాలని ఆలోచిస్తున్నది. బీరు, వైన్, పండ్లు, పండ్ల రసాలతో సహా అమెరికా నుంచి వచ్చే వస్తువులపై 25 శాతం పన్ను విధించనున్నట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ ప్రకటించాడు. తొమ్మిది వేల కిలోమీటర్ల దూరం ఉన్న సరిహద్దులో ఇరు దేశాల వాణిజ్య లావాదేవీలు రోజుకు రెండున్నర బిలియన్ల డాలర్ల మేర జరుగుతున్నాయి. పన్నుల విధింపు తమ మీద ఆర్థిక యుద్ధం ప్రకటించటం, రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక బంధాన్ని ఉల్లంఘించటమే అంటూ దీన్ని తాము, కెనడియన్లతో కలసి ప్రతిఘటిస్తామని బ్రిటీష్ కొలంబియా ప్రధాని డేవిడ్ ఇబై ప్రకటించాడు. డాలర్‌కు డాలర్ అన్న పద్ధతిలో దెబ్బ తీస్తామని కెనడాలోని ఒంటారియో రాష్ట్ర నేతలు చెప్పారు. తమ మీద అడ్డగోలుగా పన్ను విధిస్తే గట్టిగా ప్రతిస్పందిస్తామని ఐరోపా యూనియన్ ప్రతినిధి వ్యాఖ్యానించాడు. ట్రంప్ చర్యను ఖండిస్తూ చర్చలకు ద్వారాలను తెరిచే ఉంచామని చైనా వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖలు ప్రకటించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలో పన్నుల విధింపును సవాలు చేస్తామని ప్రకటించాయి. ఫెంటానిల్ అమెరికా సమస్య. దాని మీద ఏ చర్య తీసుకున్నా తాము మద్దతు ఇస్తామని చైనా స్పష్టం చేసింది.

# 33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం కేటాయించాలి !





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ.....

2023 చివరలో హడావిడిగా పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేయడం జరిగినది. ఆ బిల్లులో బీసీ కులాల వారికి మహిళలకు సబ్ కోటాగా 50 శాతం రిజర్వేషన్ అమలు చేయటానికి ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లును సవరణ చేసి ఆమోదింప చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ శ్రీమతి పేరం అలేఖ్య న్యాయవాది గారు డిమాండ్ చేశారు. స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకుండా కాంగ్రెస్ పార్టీ 55 సంవత్సరాలు పరిపాలన చేసింది బిజెపి పార్టీని 40 సంవత్సరాల క్రితం ఏర్పరచినప్పటికీ 17 సంవత్సరాలుగా పరిపాలన చేస్తున్నది వాజ్పేయి గారు ఆరు సంవత్సరాలు నరేంద్ర మోడీ గారు 11 సంవత్సరాలుగా పరిపాలన చేస్తున్నారు. బీసీలను అన్ని రంగాలలోను అణచివేయడమే జరుగుతున్నది. గత ఏడాది బడ్జెట్లో దేశంలోని 80 కోట్ల మంది బీ సీ జనాభాకు కేవలం 3000 కోట్లు కేటాయించారు ఈసారి మొన్న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో మరో 500 కోట్లు తగ్గించి కేవలం 2500 కోట్లు మాత్రమే బిసి సంక్షేమానికి కేటాయించారు పెరగవలసిన బడ్జెట్ను తగ్గిస్తూ వస్తున్నారు ఈ 2500 కోట్ల బడ్జెట్ ద్వారా 80 కోట్ల మందికి ఏడాది పొడవునా నెలకు ?30 రూపాయలు కేటాయించినట్లుగా ఉన్నది రోజుకు 15 పైసలు కేటాయించినట్లుగా ఉన్నది. ఇది పూర్తిగా దేశంలోని బీసీ కులాల వారి పట్ల వివక్ష కనపడుతున్నది అని అలేఖ్య గారు ఆరోపించారు. ఇప్పటికైనా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లకై ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని మహిళా బిల్లులో 33% గా ఉన్న దాంట్లో 50 శాతం బీసీ మహిళలకు సబ్కోటగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బడ్జెట్ పార్లమెంటు సమావేశాల సందర్భంగా అలేఖ్య గారు కోరినారు ఈ కార్యక్రమంలో బీసి కులాల ఉద్యమ పోరాట సంఘం సీనియర్ నాయకురాలు కుమ్మరి కోడూరి లీలావతి ప్రజాపతి గారు శ్రీమతి తరిగొప్పుల లక్ష్మీ మహేందర్ గారు శ్రీమతి తోటపల్లి బాలమణి గారు శ్రీమతి మూల రేణుక భాస్కర్ గౌడ్ గారు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్లో మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆదిలాబాద్ జిల్లా బోత్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకులు

-బోత్ ఇంచార్జ్ ఆడే గజేందర్ నేతృత్వంలో గాంధీభవన్కు భారీగా చేరుకున్న స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులు, నేతలు

-నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి సీతక్క

-చేరికల కార్యక్రమంలో టిఆర్ఎస్ పై నిప్పులు జరిగిన మంత్రి సీతక్క

మంత్రి సీతక్క

ప్రజలను రెచ్చగొట్టే లా టిఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది దిగజారుడు రాజకీయాలను టిఆర్ఎస్ మానుకోవాలి రైతు భరోసా నిధులను రైతు ఖాతాల్లో జమ చేస్తున్నాం కొన్ని యూట్యూబ్ ఛానల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు అబద్ధాలు ఎంతో కాలం నిలవవు ప్రజలకు వాస్తవాలు తెలుసు.. మేము ఉచిత పనిచేస్తున్నాము అధికారం పోగానే టిఆర్ఎస్ నేతలు అక్కస్సు వెలగకుతున్నారు రాష్ట్రంలో సమస్యలకు బి ఆర్ ఎసే కారణం పదేళ్లు పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో సమస్యలు తిష్ట వేశాయిబీఆర్ ఎస్ నే రాష్ట్రానికి అతిపెద్ద సమస్యతప్పుడు లెక్కలు చెప్పటంలో బి ఆర్ ఎస్ దిట్ట 1200 మంది అమరవీరులు చనిపోయారని చెప్పి.. తెలంగాణ వచ్చిన తర్వాత 400 మందికి కుదించారు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

అధికారులు శాస్త్రీయంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేసి కులాల లెక్కలను తేల్చారు ప్రజల్లో మంచి పేరు వస్తుంటే తట్టుకోలేకపోతున్నారు అనగారిన వర్గాల దశాబ్దాల సమస్యను సీఎం రేవంత్ రెడ్డి గారు పరిష్కారం చూపారు బిజెపి బీఆర్ఎస్ స్పాన్సర్ లీడర్స్ టార్గెట్ చేసి విమర్శలు చేస్తున్నారు అబద్దానికి పుట్టిందే బీఆర్ఎస్అబద్ధానికి అంబాసిడర్ బీఆర్ఎస్ప్రజలు అర్థం చేసుకోవాలి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందు తుంటి టిఆర్ఎస్ కుట్రలు చేస్తోంది టిఆర్ఎస్ కు కుల గణన చేపట్టటం చేతకాలేదు.. ఎస్సీ వర్గీకరణ చేయలేదు Limka బుక్ రికార్డు కోసం ఒకరోజు సర్వే హడావుడి చేశారు ఆ సర్వే నివేదిక లో నిజం లేదు కాబట్టే అసెంబ్లీలో పెట్టలేదు.. చట్టబద్ధత కల్పించలేదు ఇంటింటికి వెళ్లి పకడ్బందీగా చేసిన సర్వే పై ఇప్పుడు కూని రాగాలు తీస్తున్నారు సర్వేలో ఎక్కడా లోపం లేదు..బీసీ జనాభా 56.33% గా వచ్చింది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన నచ్చి ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు సంక్షేమ రాజ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుంది పార్టీలో చేరిన బోథ్ ప్రజలకు ధన్యవాదాలు హాలోఇంకా మాకు నాలుగు సంవత్సరాలు సమయం ఉంది ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం మీకు 10 ఏళ్లు అధికారం అప్పుజెప్పిన మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు పారదర్శకంగా గ్రామ సభలోనే అర్హులని ఎంపిక చేస్తున్నాం

# బీసీల జనాభా శాతం కేవలం 46.25 శాతంగా చూపించటంలో ఏమాత్రం శాస్త్రీయత లేదు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఏనుగు తల యాదగిరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలసమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆశాస్త్రీయం ఆమోదయోగ్యం లేదు బిసి కుల గణన వివరాలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ వెబ్ సైట్ లో పొందు పరిచి ప్రభుత్వ చిత్త సుద్ధి ప్రకటించాలి. అని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నాం ఉన్నాం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివిధ వర్గాల జనాభా శాతానికి సంబంధించిన వివరాలు ఆశాస్త్రీయంగాను ఆమోదయోగ్యంగా లేవు. ముఖ్యంగా బలహీన వర్గాలకు (బీసీ) చెందిన సమాచారం లో అస్పష్టత ఉందని భావిస్తున్నాం. సర్వే ప్రకారంగా 134 కులాల బీసీల జనాభా శాతం కేవలం 46.25 శాతంగా చూపించటంలో ఏమాత్రం శాస్త్రీయత లేదు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం 134 కులాల సర్వే చేసిన ప్రకారం కులాల వారిగా జనాభాను శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం సూక్ష్మ స్థాయిలో కుల గణన వివారాల పట్టిక రావడం వల్ల బిసిల సామజిక ఆర్థిక విద్య ఉద్యోగ రాజకీయ అంశాల పైన సమగ్రమైన ముందుడుగు పడుతుందని అన్నారు.

# పలు ఆహ్వానాలను స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ ,ప్రజా స్వేచ్ఛ

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ని సూరారం గ్రామ శ్రీ కట్టమైసమ్మ తల్లి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర,నిజాంపేట గ్రామ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి 124వ వార్షికోత్సవ జాతరకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.అనంతరం దళిత సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సూరారంలో నిర్వహించే భారత రాజ్యాంగ పరిరక్షణ సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ వారి ఆహ్వానాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, ఏనుగుల కృష్ణారెడ్డి, వారాలవినోద్, నేమూరి రమేష్, జేమ్స్, అమర్ బాబు, బండి శ్రీనివాస్ గౌడ్, పులి సందీప్, ఆయుష్ దీక్షిత్, సిద్దయ్య, సత్తిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఏసురత్నం, మల్లేష్ యాదవ్, వారాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల పై ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేసిన రాంనరేశ్ నగర్ కాలనీ వాసులు



శేరిలింగంపల్లి ,ప్రజా స్వేచ్ఛ

హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేశ్ నగర్ కాలనీ వాసులు పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని వివేకానంద నగర్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది. దీనిపై పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించడం జరిగినది. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ గారు మాట్లాడుతూ త్వరలోనే రాం నరేష్ నగర్ కాలనీ లో పర్యటిస్తానని, రాం నరేష్ నగర్ కాలనీ లో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని. త్వరలనే సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని రోడ్ల ను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని అధికారులకు తెలియచేసారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని ,ఎల్లవేళలో మీకు అందుబాటులో ఉంటానని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్ మరియు రాంనరేశ్ నగర్ కాలనీ వాసులు చాట్ల రవి, చెట్టి సత్యనారాయణ, నక్క సురేష్, చంద్రయ్య, నాగార్జున రెడ్డి, నారాయణ,బ్రహ్మయ్య కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాజి మంత్రి సత్యవతి రాథోడ్ హరీష్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసారు



కుత్బుల్లాపూర్ ,ప్రజా స్వేచ్ఛ

ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాజి మంత్రి సత్యవతి రాథోడ్ పార్టీ విప్ లుగా నియమితులైన సందర్భంగా హరీష్ రావు ని మర్యాదపూర్వకంగా కలసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని సద్వినియోగం చేసుకుంటూ, చట్టసభలలో పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పని చేస్తామని తెలిపారు. ప్రజాసేవకు ఈ పదవి మరింత మార్గదర్శకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం హరీష్ రావు ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ కి మాజి మంత్రి సత్యవతి రాథోడ్ కి తన శుభాకాంక్షలు తెలియజేస్తు వారికి ఈ అవకాశం కల్పించిన కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ శ్రేయస్సు కోసం బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.

# యాదీష్ కు ఘన సన్మానం.



**మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ**
మహేశ్వరం మండల నూతన బిజెపి పార్టీ అధ్యక్షునిగా టి. యాదీష్ ను పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో గురువారం మహేశ్వరం మాజీ ఎంపిటిసి సుదర్శన్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు టి. యాదీష్ మాట్లాడుతూ.. బిజెపి పార్టీని మండలంలో ప్రతి ఒక్కరిని కలుపుకొని పోయి పార్టీని తిరుగులేని శక్తిగా ఏర్పాటు చేస్తానని ఆయన పేర్కొన్నారు. మహేశ్వరం మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించే విధంగా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. బిజెపి పార్టీ అంటే క్రమశిక్షణకు మారుపేరుగా ఉందని ఆయన పేర్కొన్నారు. సమ సమాజ నిర్మాణం బిజెపి పార్టీతోనే సాధ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం బీజేపీ పార్టీ నాయకులు పంతు నాయక్, హనుమంత్ బూత్ కమిటీ అధ్యక్షులు, యువకులు పాల్గొన్నారు.

# బీడ కన్నె గ్రామంలో ఘనంగా పాత పంటల జాతర.





**జహీరాబాద్ ప్రజా స్వేచ్ఛ**
డి డి ఎస్ పస్తాపూర్ ఆధ్వర్యంలో గురువారం ఝరాసంగం మండలం బిడకన్య గ్రామంలో డిడిఎస్ మహిళ ల 25వ పాత పంటల జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు బండ్లకు పూజలు చేసి జాతరను ప్రారంభించారు. జాతర నిర్వాహకులు మాణిక్యం మాట్లాడుతూ మన భూముల్లో చిరుధాన్యాలు పంటలపై కొర్రలు, తైదలు, సజ్జలు, జొన్నలు, పండించుకోవడం వల్ల బిపి, షుగర్, గుండె జబ్బులు అటువంటివి అన్ని తరలిపోతాయని డిడిఎస్ నిర్వాహకులు చెబుతున్నారు. గ్రామ గ్రామాన తిరిగి జహీరాబాద్ నియోజకవర్గంలో పండించే రైతులకు చిరుధాన్యాల గురించి అవగాహన కల్పిస్తున్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ.






**ప్రజా స్వేచ్ఛ**
**మంచిర్యాల జిల్లా, భీమారం**
మంచిర్యాల జిల్లా, భీమారం గ్రామం లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు భీమారం పోలీసులు తెలిపారు. ఎస్సై కే.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం ఐ టి డి ఏ కాలనీ కి చెందిన రాంటెంకి రంజిత్ కుమార్ s/o లచయ్య 31-01-2025 నాడు తన కొడుకు అక్షరాభ్యాసం కోసం సిద్దిపేట శనిగరం గ్రామం సరస్వతి గుడికి ఇంటికి తాళం వేసుకుని వెళ్లి తిరిగి తేది 05-02-2025 కి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 50 వేల రూపాయల నగదు, 42 వేల రూపాయల బంగారం ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు భీమరం ఎస్సై కె . శ్వేత తెలిపినారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీకి బిజెపి సిద్దంగా ఉంది

**-జిల్లా అధ్యక్షులు డి.నారాయణ**



**ప్రజా స్వేచ్ఛ**
రాబోయే స్థానిక ఎన్నికలపై చర్చించడానికి ఈరోజు జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని జిల్లావ్యాప్తంగా సర్పంచి ఎంపీటీసీ, జడ్పిటిసి మున్సిపల్ ఎన్నికలకు బిజెపి పార్టీ పూర్తిస్థాయిలో పోటీ చేయడానికి అభ్యర్థులను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయిలో ఎన్నికల మేనేజ్ మెంట్ కమిటీలు మరియు మండల ఇంచార్జులను నియమించి మొదటగా పోలింగ్ బూత్ స్థాయిలో సమావేశాలు,శక్తి కేంద్రం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి పోటీచేసే ఆశావావుల అభ్యర్థనలను తీసుకోవాలని పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసానివ్వాలని నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రతి పోలింగ్ బూత్ కేంద్రం నుంచి పదిమంది సభ్యులతోపాటు మండల,జిల్లా కమిటీలు, మోర్చాల కమిటీలు సెల్ కన్వీనర్ పూర్తిస్థాయిలో పాల్గొనేలా జిల్లాస్థాయిలో స్థానిక ఎన్నికలపై సమరభేరి సభను నిర్వహిస్తామని ఆ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు జి.కిషన్ రెడ్డి లేదా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గార్లచే స్థానిక ఎన్నికలకు సమరశంఖం పూరించనున్నామని తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా రెండవ పర్యాయం నియమితులైన డి.నారాయణ ను ముఖ్య నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించడం జరిగింది.

# సిసి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**గోపాల్ పేట్ ,ప్రజా స్వేచ్ఛ**
మండల కేంద్రంలోని బసవన్న గుడి నుండి తెలుగు చంద్రయ్య వరకు జాతీయ ఉపాధి హామీ నిధులు నుంచి ఐదు లక్షల రూపాయలతో మంజూరైన సిసి రహదారి నిర్మాణాన్ని గురువారం మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కాలనీవాసులు స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్, గ్రామ అధ్యక్షుడు శివన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధాకర్ రావు, కేతపల్లి వెంకటయ్య, శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**మెదక్ ,ప్రజా స్వేచ్ఛ**
మెదక్ మండలం మంబోజి పల్లి గ్రామానికి చెందిన మేకల మల్లేశం (క్రైలాబ్) బుధవారం సాయంత్రం మృతి చెందాడు ఇట్టి విషయాన్ని గ్రామ పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న మెదక్ నియోజకవర్గ. BRS పార్టీ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, గురువారం మృతుడి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయంగా 5000 వేల రూపాయలను గ్రామా మాజీ సర్పంచులు, గంజి ప్రభాకర్, అంజా గౌడ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్య,మాజీ ఎంపీటీసీ మేకల మానస రాములు, గ్రామ పార్టీ అధ్యక్షులు కుమ్మరి రమేష్, నాయకులు గంజి నవీన్, మరియు పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి అందజేయడం జరిగింది

# వసతి గృహం నుండి తప్పిపోయిన విద్యార్థి హైదరాబాద్ లో లభ్యం

**గోపాల్ పేట్ ప్రజా స్వేచ్ఛ**
వసతి గృహం నుండి మిస్ అయిన విద్యార్థి హైదరాబాద్ బస్టాండ్ లో దొరికిన సంఘటన మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో చోటుచేసుకుంది. కొత్తకోట మండలం ముమ్మల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీవాటి సందీప్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలురవసతి గృహంలో ఉంటూ స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం వసతి గృహం నుండి బయటకు వెళ్లి బస్టాండ్ లో ఒక వ్యక్తి వద్ద ఫోన్ తీసుకొని నోట్ బుక్స్, బ్యాగు, తీసుకోవాలి డబ్బులు కావాలని తండ్రి శ్రీవాటి కురుమూర్తికి ఫోన్ చేశాడు. దీంతో అతని తండ్రి ఫోన్ పే ద్వారా రెండు వందల రూపాయలు పంపించాడు. డబ్బులు తీసుకొని కనిపించకుండా పోయాడు. దీంతో వసతిగృహ అధికారి తో పాటు, తోటి స్నేహితులు అంతట వెతుకుతూ అతడి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు దీంతో వారు వెతక సాగారు. గురువారం సందీప్ వద్ద నుండి (ఇతరుల ఫోన్ తో ) తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. ఎక్కడ ఉన్నావ్ అని అడగగా హైదరాబాద్ బస్టాండ్ లో ఉన్నట్లు సందీప్ జవాబు ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు అప్రమత్తమై హైదరాబాదులో ఉంటున్న వరుసకు చిన్నాన్న అయినా ఆటో డ్రైవర్ కు ఫోన్ చేసి విషయం చెప్పగా అతడు హుటాహుటిన బస్టాండ్ లో ఉన్న సందీప్ వద్దకు చేరుకొని అతడి తల్లిదండ్రులకు ఫోన్ చేయించాడు. దీంతో అతని తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ రెడ్డిని గెలిపించండి.



**చౌటుప్పల్ మున్సిపాలిటీ న్యూస్, ప్రజా స్వేచ్ఛ**
చౌటుప్పల్ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఉపాధ్యాయుల హక్కుల సాధనకై రాజీలేని పోరాటం చేయదలచిన తపస్ బలపరిచిన ఉమ్మడి నల్గొండ -వరంగల్ -ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ... ఫిబ్రవరి 27వ తేదీన జరిగే ఉమ్మడి నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ భావాలను కలిగిన ప్రతి ఒక్కరు పులి సరోత్తం రెడ్డికి ఉపాధ్యాయులు గెలిపించుకోగలరని పత్రిక ప్రకటనలో గురువారం కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కై ఆలోచించి ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్, మాజీ మండల,మున్సిపల్ అధ్యక్షులు చినుకని మల్లేష్ యాదవ్,కంచర్ల గోవర్ధన్ రెడ్డి, నాయకులు కట్ట కృష్ణ,ఉబ్బు బుచ్చయ్య, రాధారపు సత్తయ్య,దిండు భాస్కర్, పబ్బు వంశీ, అల్మాసిపేట గౌతమ్, ఉష్కాగుల నాగరాజు, వనం ధనంజయ, రవీందర్ చెన్నగొని శివప్రసాద్ దూసరి శివసాయి, బుడ్డ సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికులకు 2నెలల నుంచి జీతాలు లేవు



**ప్రజా స్వేచ్ఛ అందోల్-జోగిపేట:-**
ప్రభుత్వ హాస్పిటల్స్ సిబ్బందికి 2 నెలలు పెండింగ్ వేతనాలు చెల్లించాలి ఏఐటిసి ఆధ్వర్యంలో జోగిపేట ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ సౌజన్య గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్ రాజ్యం ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ హౌస్ కీపింగ్ పేషెంట్ కేర్ సిబ్బందికి 2 నెలల వేతనాలు చెల్లించకపోవడం వలన కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బంది ఎదురుకుంటున్నారు.వీరందరికీ వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరడం జరిగింది . ఈరోజు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జోగిపేట ప్రభుత్వ దవాఖాన సూపర్డెంట్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని లేనియెడల రేపటినుండి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి శ్రావణి రాణి నాగరాజ్ లక్ష్మి హరి తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పట్టపగ్గాలు లేకుండా పసిడి పరుగులు..

### రూ.8 వేలు పెరిగిన బంగారం.. లక్ష మార్క్ దాటుతుందా?



బంగారం ధర రన్ రాజా రన్ అంటూ పట్టపగ్గాల్లేకుండా పరుగు పెడుతోంది. నెల రోజుల వ్యవధిలో ఏకంగా 8 వేలు పెరిగింది. 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఇవాళ 86 వేలు దాటింది. ఈ దూకుడు ఇంతటితో ఆగుతుందా? లక్ష మార్క్‌ను టచ్ చేస్తుందా? అసలే మాఘమాసం.. తెలుగురాష్ట్రాల్లో మార్చి 26 వరకు లక్షలాది వివాహాలు జరగనున్నాయి. ఈ క్రమంలో పెరిగిపోతున్న బంగారం ధరలు చూసి ఆడపిల్లల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. అమెరికాలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక యూఎస్ డాలర్ బలపడుతోంది. విదేశీ ఇన్వెస్టర్లు ఇండియాలో పెట్టుబడుల్ని ఉపసంహరించుకుంటున్నారు. దీంతో దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఇదే సమయంలో దేశీయ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో గోల్డ్ రేట్లు పెరుగుతున్నాయంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ముందు ముందు 10 గ్రాముల బంగారం ధర లక్ష దాటినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటున్నారు. వెండి ధర కూడా లక్షకు చేరుకుంటుంది. కొన్ని రాష్ట్రాల్లో అయితే లక్ష 10 వేల రూపాయలకు చేరువలో ఉంది. బడ్జెట్‌కు ముందు నుంచే బంగారం, వెండి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. ఇన్వెస్టర్లు, సాధారణ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ పెరగడంతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో అస్థిరత, అమెరికన్ విధానాల కారణంగా ప్రజలు సురక్షితమైన పెట్టుబడిగా బంగారం కొనుగోలును పెంచుతున్నారు. దీని కారణంగా దాని ధర నిరంతరం పెరుగుతోంది. వడ్డీరేట్లను తగ్గించడంతోపాటు ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి కొనసాగితే బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, వివాహాలు, పండుగ సీజన్లలో వారి డిమాండ్ ఎక్కువగా ఉండవచ్చు, దీని కారణంగా ధరలు అధిక స్థాయిలో ఉండవచ్చు.

## మార్కెట్‌లో బెస్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవే



అథర్ రిజ్టా ఎలక్ట్రిక్ స్కూటర్ 2.9, 3.7 కేడబ్ల్యూహెచ్ అనే రెండు రకాల బ్యాటరీ ఎంపికలతో అందుబాటులోకి వచ్చింది. ఒకే చార్జ్ పై 123, 160 కిలోమీటర్లు పరుగులు తీస్తుంది. దీనిలో 56 లీటర్ల అపారమైన లగేజ్ స్థలం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇందులో 35 లీటర్ల అండర్ సీట్ స్టోరేజ్, 22 లీటర్ల ఫ్రంట్ గ్లోవ్ కంపార్టుమెంట్ ఉన్నాయి. గంటకు 80 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణం చేయవచ్చు. ఈ స్కూటర్ రూ.1.10 లక్షల ధరలో అందుబాటులో ఉంది. బజాజ్ కంపెనీ నుంచి 35 సిరీస్ అనే కొత్త తరం చేతక్ స్కూటర్ విడుదలైంది. దీనిలో 3501, 3502 అనే రెండు వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.1.20 లక్షల నుంచి రూ.1.27 లక్షలు పలుకుతున్నాయి. దీనిలో 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఏర్పాటు చేశారు. ఫుల్ చార్జింగ్ తో 153 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. గరిష్ట వేగం గంటకు 75 కిలోమీటర్లు. హీరో మోటోకార్ప్ నుంచి విడుదలైన హీరో విడా వీ2 స్కూటర్ ఎంతో ఆకట్టుకుంటోంది. దీనిలో లైట్, ప్లస్, ప్రో అనే మూడు రకాల వేరియంట్లు ఉన్నాయి. వీటిలో 2.2, 3.44, 3.94 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ లను ఏర్పాటు చేశారు. బ్యాటరీలను ఇంట్లోనే చార్జింగ్ చేసుకోవచ్చు. కేవలం ఆరు గంటల్లోనే దాదాపు 80 శాతం చార్జింగ్ అవుతుంది. ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.96 వేలు. ప్రముఖ కంపెనీ హొండా నుంచి యాక్టివా ఇ పేరుతో ఎలక్ట్రిక్ స్కూటర్ విడుదలైంది. దీనిలో 1.5 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం కలిగిన రెండు మార్పిడి (స్వాపబుల్) చేయగల బ్యాటరీలను అమర్చారు. ఒక్కసారి చార్జింగ్ చేస్తే సుమారు 102 కిలోమీటర్ల రేంజ్ వస్తుంది. అలాగే హొండా ఇ.స్వాప్ అనే బ్యాటరీ షేరింగ్ సేవను కూడా ప్రారంభించనుంది. టీవీఎస్ ఐక్యూబ్ ఎస్టీ 5.1 స్కూటర్ లో 5.1 కేడబ్లూహెచ్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. సింగిల్ చార్జింగ్ తో సుమారు 150 కిలోమీటర్లు పరుగులు తీస్తుంది. గంటకు గరిష్టంగా 82 కిలోమీటర్ల వేగంగా ప్రయాణం చేయవచ్చు. టీఎఫ్టీ టచ్ స్క్రీన్, 118కి కనెక్ట్ చేయబడిన ఫీచర్లు, అలెక్సా ద్వారా వాయిస్ అసిస్ట్, డిజిటల్ డాక్యుమెంట్ స్టోరేజ్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ తదితర ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ రూ.1.85 లక్షల (ఎక్స్ షోరూమ్)కు అందుబాటులో ఉంది.

## 3 లక్షల హొండా కార్లు రీకాల్. కారణం ఏమిటో తెలుసా?




హొండా తన దాదాపు 3 లక్షల వాహనాలను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించి కంపెనీ జనవరి 29, 2025న ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. కారు ఇంజిన్‌లో సమస్యల ఫిర్యాదుల నేపథ్యంలో అమెరికాలో దాదాపు 2.95 లక్షల కార్లను రీకాల్ చేసినట్లు కంపెనీ ప్రకటించింది. మరి కారులో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉన్నాయో తెలుసుకుందాం. ఇంధన ఇంజెక్షన్ ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ లోపభూయిష్ట ప్రోగ్రామింగ్ ఉన్నట్లు గుర్తించారు. నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, కారు ఇంజిన్‌లో లోపం వల్ల థ్రోటిల్‌లో ఆకస్మిక మార్పులు సంభవించవచ్చని, దీని వలన ఇంజిన్ డ్రైవ్ పవర్ తగ్గవచ్చని, ఇంజిన్ అడపాదడపా నిలిచిపోవచ్చని లేదా అకస్మాత్తుగా ఆగిపోతుందని హొండా తెలిపింది. కారు నడుపుతున్నప్పుడు అకస్మాత్తుగా ఇంజిన్ పనిచేయకపోవడం వల్ల ఏదైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది.

## తొలి వన్డేలో భారత్ ఘన విజయం



ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమ్ ఇండియా వన్డే సిరీస్‌లోనూ బోణీ కొట్టింది. ఇంగ్లిష్ జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాగ్‌పుర్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. 4 వికెట్ల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చిత్తుగా ఓడించింది. కేవలం 38.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి.. తొలి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (87బీ 96 బంతుల్లో 14ఐ4) చెలరేగి ఆడాడు. ఓ వైపు కండరాల నొప్పి వెంటాడుతున్నా.. అద్భుత పోరాటం చేశాడు. అక్షర్ పటేల్ (52బీ 47 బంతుల్లో 6ఐ4, 1ఐ6), శ్రేయస్ అయ్యర్ (59బీ 36 బంతుల్లో 9ఐ4, 2ఐ6) అర్ధశతకాలు సాధించారు. ఓపెనర్లు జైస్వాల్ (15), రోహిత్ శర్మ (2) నిరాశ పరిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్, మహమూద్, బెతెల్, రషీద్ తలో వికెట్ తీశారు.

## ఆర్‌సీబీ జట్టుకు భారీ ఎదురుదెబ్బ



ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ దూరం?

ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమణ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఐపీఎల్ 2025కి ముందు ఆ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఐపీఎల్ వేలంలో ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్‌ను ఆర్‌సీబీ జట్టు అత్యంత ఖరీదైన బౌలర్‌గా చేసి రూ.12.50 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ, ఐపీఎల్ 2025కి ముందు, అతను గాయం కారణంగా శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమించాడు. కానీ ఇప్పుడు ఈ బౌలర్ ఐపీఎల్ 2025 నుంచి కూడా తప్పుకోవచ్చని చెబుతున్నారు. ఈ ఆటగాడిని పొందడానికి జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్‌తో పోరాడింది. కానీ ఇప్పుడు గాయం, ఆ తర్వాత శస్త్రచికిత్స తర్వాత, ఈ ఆటగాడు 2025 సీజన్‌లో ఆడటం కష్టమని చెబుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించనున్న ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమ్మిన్స్ కూడా ఐపీఎల్ 2025లో ఆడే అవకాశం లేదని తెలుస్తోంది. పాట్ కమ్మిన్స్ చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడటం అతనికి కష్టంగా అనిపిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో, అతను ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉంటే, ఈ బౌలర్ కూడా ఐపీఎల్‌కు దూరంగా ఉండవచ్చు. అయితే, ఇప్పటివరకు ఏదీ స్పష్టంగా తెలియలేదు. క్రికెట్. కామ్ ఆస్ట్రేలియా నివేదిక ప్రకారం, పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్ కోలుకోవడానికి చాలా సమయం పట్టవచ్చు. వారిద్దరూ పూర్తిగా ఫిట్ అయ్యే వరకు ఆడటం కష్టం. ఇటువంటి పరిస్థితిలో, వారిద్దరూ ఐపీఎల్‌లో కూడా పాల్గొనడం కష్టంగా అనిపిస్తుంది. కాలి గాయం కారణంగా హాజిల్‌వుడ్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రెండవ అర్ధభాగానికి దూరమయ్యాడు. గాయం కారణంగా శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు కూడా అతను దూరంగా ఉన్నాడు. కానీ, ఇప్పుడు మరో గాయం అతన్ని బాధపెడుతోంది. ఇంతలో, కామెరాన్ గ్రీన్ ఇప్పటికే 2025 ను కోల్పోతున్నానని ధృవీకరించాడు. మిచెల్ మార్ష్ కూడా గాయపడి ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఆడటం కష్టంగా అనిపిస్తుంది.

# స్పోర్ట్స్

## రిటైర్మెంట్ ప్రకటించిన మార్కస్ స్టోయినిస్

### సోషల్ మీడియా వేదికగా వెల్లడి




ఆస్ట్రేలియా టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయం కారణంగా ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి తప్పుకున్నాడు. అలాగే వన్డే కెప్టెన్ పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్ ఇద్దరు కూడా టోర్నమెంట్‌కు దూరంగా ఉంటారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాకు మరో భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ వన్డే క్రికెట్ నుంచి అనూహ్యంగా తప్పుకున్నాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. ‘నా ఈ నిర్ణయం అంత సులభం కాదు. కానీ వన్డే క్రికెట్ నుంచి వైదొలిగి నా కెరీర్‌లోని తదుపరి అధ్యాయంపై పూర్తిగా దృష్టి పెట్టడానికి ఇదే సరైన సమయం అని నేను నమ్ముతున్నాను’ అని మార్కస్ స్టోయినిస్ పేర్కొన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండగానే స్టోయినిస్ ఆశ్చర్యకరమైన నిర్ణయం తీసుకున్నాడు. అందువల్ల, ఆస్ట్రేలియన్ క్రికెట్ బోర్డు రాబోయే టోర్నమెంట్ కోసం ప్రత్యామ్నాయ ఆల్ రౌండర్‌ను ఎంచుకోవలసి ఉంటుంది. అంతకుముందు, ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన 15 మంది సభ్యుల ఆస్ట్రేలియా జట్టులో మార్కస్ స్టోయినిస్‌కు చోటు లభించింది. అయితే, స్టోయినిస్ ఇప్పుడు తన వన్డే అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ముగించనున్నట్లు ప్రకటించాడు. 35 ఏళ్ల మార్కస్ స్టోయినిస్ వన్డే క్రికెట్ కు వీడ్కోలు పలికినప్పటికీ, తాను టీ20 అంతర్జాతీయ క్రికెట్ ఆడటం కొనసాగిస్తానని చెప్పాడు. రాబోయే రోజుల్లో ఫ్రాంచైజ్ లీగ్‌పై మరింత దృష్టి పెట్టాలని కూడా అతను నిర్ణయించుకున్నాడు. మార్కస్ స్టోయినిస్ ఆస్ట్రేలియా తరఫున 71 వన్డేలు ఆడాడు. మొత్తం 64 ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్ చేసి, 1 సెంచరీ, 6 అర్ధ సెంచరీలతో సహాయంతో 1495 పరుగులు సాధించాడు. అలాగే 48 వికెట్లు కూడా పడగొట్టాడు.

....




# ప్రభాస్‌కు జోడీగా సాయి పల్లవి..
## ఏ సినిమాలోనంటే

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నాడు. రీసెంట్ గా రెండు బ్లాక్ బస్టర్స్ తో ఫుల్ జోష్ లో ఉన్నాడు రెబల్ స్టార్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన సలార్ సినిమా సంచలన విజయం సాధించింది. యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. మరోసారి ప్రభాస్ సత్తా ఎంతో బాక్సాఫీస్ కు రుచి చూపింది సలార్ ఈ సినిమా దాదాపు రూ. 700కోట్లకు పైగా వసూల్ చేసింది. ఇప్పుడు ఈ సినిమాకు సెకండ్ పార్ట్ ను తెరకెక్కించనున్నారు. అలాగే నాగ్ అశ్విన్ దర్శకత్వంలో కల్కి సినిమా చేశాడు ప్రభాస్. ఇక ఈ సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. బాక్సాఫీస్ ను షేక్ చేసింది కల్కి.. ఏకంగా రూ. 1000కోట్లకు పైగా వసూల్ చేసి ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది.ఇక ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాల షూటింగ్స్ తో బిజీ బిజీగా గడుపుతున్నాడు ప్రభాస్. త్వరలోనే రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సినిమాకు మారుతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాలతో పాటు సందీప్ రెడ్డి వంగతో స్పిరిట్, ప్రశాంత్ సలార్ 2, కల్కి 2 సినిమాలు చేస్తున్నాడు. వీటితో పాటు హనురాఘవపుడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. హను తెరకెక్కిస్తున్న సినిమాకు ఫౌజీ అనే ఆసక్తికర టైటిల్ పరిశీలిస్తున్నారు. ఈ సినిమా యుద్ధనేపథ్యంలో ఉంటదని టాక్.కాగా ఈ సినిమా పూజాకార్యక్రమం ఆ మధ్య మొదలైంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ను కూడా ప్లాన్ చేస్తున్నారు. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ గా ఇమాన్వీ నటిస్తుందని కన్ఫార్మ్ చేశారు. అయితే ఇప్పుడు ఈ సినిమాలో మరో హీరోయిన్ కూడా నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. ఫౌజీ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుందని తెలుస్తుంది. పీరియాడిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఫ్లాష్ బ్యాక్ స్టోరీలో హీరోయిన్ గా సాయి పల్లవి అయితే బాగుంటుందని భావించిన దర్శకుడు ఆమెను సంప్రదించినట్టు తెలుస్తుంది. మరి ఈ వార్తల్లో వాస్తవం ఎంత అన్నది తెలియాల్సి ఉంది. గతంలో హనురాఘవపూడి దర్శకత్వంలో సాయి పల్లవి పడిపడి లేచే మనసు సినిమా చేసిన విషయం తెలిసిందే..

# ఫ్లాప్ సినిమా పుణ్యమా అని స్టార్ హీరో మూవీలో ఛాన్స్



ఇండస్ట్రీలో కొత్త ముద్దుగుమ్మల సందడి కనిపిస్తుంది. రీసెంట్‌గా వచ్చిన అందాల భామలు వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. బ్యాక్ టు బ్యాక్ ఛాన్స్ లు అందుకుంటూ పాన్ ఇండియా హీరోయిన్స్ గా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. మరికొంతమంది భామలు ఇప్పటికీ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే చేసిన సినిమాలు కూడా ఫ్లాప్ అవుతున్నాయి. ఈ హీరోయిన్ పరిస్థితి కూడా అంతే.. చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అవుతూ వచ్చాయి .. దాంతో ఛాన్స్ లు అందుకోవడంలోనూ వెనకబడింది ఈ అమ్మడు మొత్తానికి ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ ఛాన్స్ లు అందుకుంటుంది. అంతే కాదు ఓ ఫ్లాప్ సినిమాతో ఓ స్టార్ హీరోతో సినిమా చేసే ఛాన్స్ అందుకుంది. ఓ సూపర్ హిట్ సినిమా వస్తే.. హీరో, హీరోయిన్స్ కు ఆఫర్స్ క్యూ కట్టడం మనం చూస్తూనే ఉంటాం. ఒక్క సినిమాతో హిట్ అందుకొని నాలుగు ఐదు సినిమాలను లైనప్ చేస్తున్నారు. కాగా ఇప్పుడు ఈ హీరోయిన్ డిజాస్టర్ సినిమాతో స్టార్ హీరోలో ఛాన్స్ అందుకుంది. ఈ విషయాన్నీ ఆమె స్వయంగా చెప్పింది పూజా హెగ్డే. ఒకప్పుడు టాలీవుడ్ ను ఏలింది పూజాహెగ్డే. ప్రస్తుతం వరుస ఆఫర్స్ అందుకుంటుంది పూజా హెగ్డే నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అయ్యాయి. తెలుగు, తమిళ్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రీసెంట్ గా బాలీవుడ్ లో దేవా అనే సినిమా చేసింది. ఈ సినిమా కూడా ప్రేక్షకులను నిరాశపరిచింది. ఈ సినిమా తర్వాత ఇప్పుడు సూర్య సినిమాలో ఛాన్స్ అందుకున్నది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న సినిమా రెట్రో.. ఈ సినిమాలో పూజకు ఛాన్స్ ఎలా వచ్చిందో తెలిపింది. ప్రభాస్ హీరోగా నటించిన రాధేశ్యామ్ సినిమా చూసి తనను సూర్య సినిమాలో సెలక్ట్ చేశారని తెలిపింది పూజా. రాధేశ్యామ్ సినిమాలో ఎమోషనల్ సీన్స్ లో నా నటన చూసి దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఈ సినిమాకు సెలక్ట్ చేశారు. సూర్య రెట్రో సినిమాలోనూ ఎమోషనల్ సీన్స్ ఎక్కువగా ఉంటాయి అని తెలిపింది పూజా. ఇలా ఓ ఫ్లాప్ సినిమా పుణ్యమా అని సూర్య సినిమాలో ఛాన్స్ అందుకుంది పూజా హెగ్డే.

# నన్ను మరోస్థాయికి తీసుకెళ్లే చిత్రం



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందు మొండేటి దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీవాసు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు నాగచైతన్య. "తండేల్' సినిమా నా కెరీర్‌లో బిగ్గెస్ట్ చిత్రం. దర్శకుడు చందుతో నాకిది మూడో సినిమా. నన్ను కొత్తగా చూపించడానికి ప్రయత్నిస్తుంటాడు. ఈ సినిమా కథను మొదట చందు చెప్పినప్పుడు అది డాక్యుమెంటరీలాగా అనిపించింది. సినిమాటిక్‌గా తయారు చేయమని చెప్పా. కొన్ని మార్పులు చేసి అద్భుతంగా మార్చారు. ఈ కథ వినే సమయంలో ఎంతో స్ఫూర్తినిచ్చింది. వెంటనే ఓకే చేశాను. ఇందులో నా పాత్ర తండేల్ రాజు కోసం చాలా శ్రమపడ్డాను. శ్రీకాకుళం వెళ్లి అక్కడ ఉండే మత్స్యకారుల జీవితాలను, వారి వేషభాషలను గమనించాను. ఒక నటుడిగా ఈ సినిమాతో నేనో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాను.ఈ సినిమా నేపథ్యం కొత్తగా ఉండడం వల్ల చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమా అంతా ఒక లెవెల్‌లో ఉంటే.. సెకండ్ ఆఫ్ మరో వీర లెవెల్‌లో ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. కథే ఈ సినిమాకు హీరో. వాస్తవిక సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని చూసి ప్రేక్షకులు భావోద్వేగానికి లోనవుతారు. ఈ సినిమా చివరి 30 నిమిషాలు చాలా బాగా నచ్చేసింది. క్లైమాక్స్ చాలా సంతృప్తిని ఇచ్చింది. ఈ చిత్రం ఓ నటుడిగా నన్ను మరోస్థాయికి తీసుకెళ్తుందనే నమ్మకం ఉంది. పాటలు అద్భుతంగా వచ్చాయి. తండేల్‌రాజు–సత్య ప్రేమ కథ తప్పకుండా అందరి హృదయాలను గెలుచుకుంటుంది" అని చెప్పారు.

# నాకేం అసూయ లేదు



తన జీవితంలో అసూయకు స్థానం లేద న్నారు కథానాయిక సమంత. తన మాజీ భర్త నాగచైతన్య రెండో వివాహంపై సమంత తొలిసారి స్పందించారు. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'జీవితంలో అన్ని అనర్ధాలకు మూలం అసూయే. దానికి నా జీవితంలో స్థానం లేదు. గతంలో నాతో రిలేషన్‌షిపలో ఉన్నవారిపైన నాకేం కోపం, అసూయ లేవు. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను' అని పరోక్షంగా నాగచైతన్య గురించి స్పందించారు. ఒకరిపైన అసూయను పెంచుకోవడం వల్ల బాధపడడం తప్ప ఒరిగేదేముంది అన్నారు. రిలేషన్‌షిప వల్ల గతంలో చాలా కష్టాలు పడ్డానని చెప్పారు. వాటి నుంచి బయటపడడానికి చాలా శ్రమించాల్సి వచ్చిందనీ, ఆ అనుభవాల దృష్ట్యా ప్రస్తుతం రిలేషన్‌షిప గురించి ఆలోచించడం లేదని తెలిపారు. సమంతతో విడాకుల అనంతరం నాగచైతన్య హీరోయిన్ శోభితా ధూళిపాళ్లను పెళ్లాడిన విషయం తెలిసిందే.

# బలగం వేణు..ఎల్లమ్మకు సర్వం సిద్ధం



బలగం సినిమాతో దర్శకుడిగా మారి తోలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టి బలగం వేణుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2023 లో విడుదలైన ఈ సినిమా ప్రశంసలతో పాటు కాసుల వర్షం కురిపించింది . వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి చాలా కాలం అవుతున్నా కూడా మరో సినిమాను పట్టాలెక్కించలేదు ఈ దర్శకుడు. బలగం సినిమాను నిర్మించిన దిల్ రాజు బ్యానర్ లోనే తన రెండవ సినిమా చేయాల్సి ఉంది.అయితే ఈ కథ అందరి చుట్టూ తిరిగ్గ ÷నైల్ గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. పలు మార్పులతో మొత్తానికి ఈ సినిమా అక్కడ ఓకే అయింది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు. ప్రస్తుతం నితిన్ చేస్తున్నరాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు చివరి దశ షూట్ లో ఉన్నాయి. ఇక ఇప్పుడు వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు నితిన్. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి ఎండింగ్ లేదా మార్చ్ లో ముహూర్తం పూజ ఉండనుందట. ఏప్రిల్ లేదా మే నుండి షూటింగ్ మొదలు కానుంది. నితిన్ ను సరికొత్తగా చూపించేందుకు కొత్త మెకోవర్ ట్రై చేస్తున్నాడు దర్శకుడు వేణు యెల్దండి. దాదాపు రెండేళ్లుగా ఈ కథ మీద కసరత్తులు చేస్తున్న వేణు ఈ సినిమాతో నితిన్ కు ఎంత పెద్ద హిట్ ఇస్తాడో చూడాలి.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492